TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

**King Daily News Paper**

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక: 214 శుక్రవారం, జూన్ 19, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు
అత్యుత్తమమైన సేవలు,
ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.
జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
మా ప్రత్యేకతలు
• అత్యవసర & క్రిటికల్ కేర్
• ప్రమాద సేవలు
• ప్రస్తూతి & గైనకాలజీ
• ఆర్థోపెడిక్స్
• జాయింట్ రీప్లేస్‌మెంట్స్
• జనరల్ మెడిసిన్
• జనరల్ సర్జరీ
• మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
• పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
• న్యూరాలజీ • న్యూరోసర్జరీ
• ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
• యూరాలజీ • డెర్మటాలజీ
• సైకియాట్రీ • ఫిజియోథెరపీ


నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ
అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్
+91 85230 89599 +91 86889 09384
www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

## రాజీవ్ యువవికాసం పథకంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభవార్త!



తెలంగాణ రాష్ట్రంలో యువత సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కొత్త ఊపిరి పోసే శుభవార్తను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజీవ్ యువవికాసం పథకం ద్వారా యువకులకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ పథకం అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాజీవ్ యువవికాసం పథకం ద్వారా యువతకు ఉపాధి, వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో సహాయం అందించడానికి తెలంగాణా ప్రభుత్వం సుముఖంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ యువత ఆర్థిక ప్రగతి సాధించడానికి ఈ పథకం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 50వేల నుండి 4లక్షల రూపాయల వరకు సబ్సిడీతో కూడిన ఆర్థికసహాయం భట్టి విక్రమార్క తాజాగా చేసిన ప్రకటనతో యువవికాసం అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తే, ఈ పథకంలో భాగంగా 50 వేల రూపాయల నుండి 4 లక్షల రూపాయల వరకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం అందుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు దీని ద్వారా లబ్ధి జరుగుతుంది. మైనారిటీ యువకులు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందుకు సాగడానికి ఇది ఒక మైలురాయి అవుతుందని భావిస్తున్నారు. సమగ్రంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని యోచన ఈ క్రమంలో ఈ పథకం అమలు దశలో యువత నుంచి సూచనలు స్వీకరించి, మరింత సమగ్రంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కూడా అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం యువతకు ఇస్తున్న ఈ ప్రాధాన్యత రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదు. మైనార్టీల అభ్యున్నతిపై భట్టి కీలక వ్యాఖ్యలు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, మైనారిటీ సమాజాల అభ్యున్నతి ప్రభుత్వ అజెండాలో ముఖ్య భాగమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 20 మైనారిటీ గురుకులాల నిర్మాణం పూర్తి కావడంతో వాటి ప్రారంభోత్సవాలు త్వరలో జరగనున్నాయని వెల్లడించారు. ఇవి మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించి ఉన్నత భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణా ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల ప్రణాళికపై భట్టి తెలంగాణ ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ప్రధాన కార్యక్రమంతో పాటు జిల్లా కేంద్రాల్లో ఉర్దూ కవి సమ్మేళనాలు నిర్వహించి సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహిస్తామన్నారు. వక్ఫ్ భూములు, మైనారిటీల సంబంధిత ఆస్తులు ఎలాంటి అన్యాక్రాంతం లేకుండా కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒశ్రీబనీ ఖీవజీట క్యూఎస్ ప్రపంచ యూనివర్సిటీల ర్యాంకింగ్స్ లో తెలంగాణా నుండి రెండు విద్యాసంస్థలు! ముస్లిం జనాభా ఎక్కువ ఉన్నచోట శ్మశాన వాటికల కోసం స్థలాలు ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో శ్మశాన వాటికల కోసం స్థలాలు కేటాయించి, చుట్టూ ప్రహరీలు నిర్మించాలని సూచించారు.

## విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపిస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నామని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

"తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల



ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి.

విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం.

విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## టెలిగ్రామ్‌కు చుక్కెదురు..

### కేంద్రం నిర్ణయాన్ని సమర్థించిన ఢిల్లీ హైకోర్టు




న్యూఢిల్లీ: నీట్ పరీక్ష నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం విధించడాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని జస్టిస్ తేజస్ కారియా తేల్చి చెప్పారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. అక్రమ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి టెలిగ్రామ్ ప్రధాన సాధనంగా మారిందని అన్నారు. అనుమానాస్పద ఛానల్స్‌పై చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు టెలిగ్రామ్‌కు సూచించామని అన్నారు. అయినప్పటికీ కంపెనీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని చెప్పారు. మరోవైపు, టెలిగ్రామ్ తరఫున సీనియర్ న్యాయవాది ధ్రువ్ మెహతా వాదనలు వినిపిస్తూ ఎమర్జెన్సీ అధికా రలతో నిషేధం విధించడాన్ని కేంద్రం సమర్థించుకోజాలదని అన్నా రు. సంబంధిత కంటెంట్‌ను మాత్ర మే బ్లాక్ చేయకుండా మొత్తం యాప్ పై ఎందుకు నిషేధం విధించాల్సి వచ్చిందో వివరించలేదని పేర్కొన్నారు. కేవలం నీట్ పరీక్షతో దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందా? అని ప్రశ్నించారు. అయితే, కోర్టు కేంద్రం వాదనలను సమర్థించింది. సెక్షన్ 69ఏ కింద ఒక డిజిటల్ వేదికను నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఉందని జస్టిస్ తేజస్ కారియా స్పష్టం చేశారు. నిషేధం ఎత్తివేత కోరుతూ టెలిగ్రామ్ చేసిన అభ్యర్థనను తిరస్కరించారు. జూన్ 22 వరకూ కేంద్రం టెలిగ్రామ్‌పై నిషేధం విధించిన విషయం తెలిసిందే.

## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించిన మంత్రి పొన్నం

హైదరాబాద్ : మినిస్టర్ క్వార్టర్స్ లో కాంగ్రెస్ అగ్ర నాయకులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి పొన్నం మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే ఒక రాజకీయ నాయకుడు గా మానవతా హృదయం కలిగిన రాహుల్ గాంధీ కు జన్మదిన శుభాకాంక్షలు. భారత్ జోడోయాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా అందరూ కలిసి ప్రజాస్వామికంగా ఉండాలని నఫ్రత్ చోడో భారత్ జోడో అని ఎటువంటి విద్వేషాలతో బతకద్దని పిలుపునిచ్చిన వ్యక్తి. రాహుల్ గాంధీ గారు బావి భారత జన్ జడ్



ఆకాంక్షల ఘనంగా ప్రధాని కావాలి. రాహుల్ గాంధీ గారు భారతదేశానికి దిశా దశ మారుస్తారు. జిత్నే అబాది ఉత్నే ఇసెదరి అని దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలని ఆశతో ఎదురు చూస్తున్న సందర్భంలో రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ గారికి జన్మదిన సందర్భంగా వారికి ఆ భగవంతుడు అన్ని రకాల శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. ..

### మూసీ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ -

# బాపు ఘాట్ వద్ద 83 ఎకరాల రక్షణ భూముల బదిలీ!

హైదరాబాద్, జూన్ 19: హైదరాబాద్ నగర ముఖచిత్రాన్ని మార్చే ప్రతిష్టాత్మక మూసి నది పునరుజ్జీవన ప్రాజెక్టు లో ఒక కీలకమైన ముందడుగు పడింది. బాపు ఘాట్ వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు వీలుగా రక్షణ శాఖకు చెందిన భూములను ఉపయోగించుకునేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్‌లోని బాపు ఘాట్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ గాంధీ సరోవర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయడానికి మూసి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు కేంద్ర రక్షణ శాఖ వర్కింగ్ పర్మిషన్ మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ భూముల విభాగం జూన్ 18, 2026 నాటి అధికారిక లేఖ ద్వారా భారత ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ , డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ జనరల్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసి ప్రక్షాళన ప్రాజెక్టులో భాగంగా ఈ ల్యాండ్ క్లియరెన్స్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్ పరిధిలో ఉన్న మొత్తం 83.814 ఎకరాల రక్షణ శాఖ భూమిని ఈ ప్రాజెక్టు కోసం ఎంఆర్‌డీసీకి అప్పగించనున్నారు. ల్యాండ్ వాల్యుయేషన్ ప్రకారం ఈ భూమి మార్కెట్ విలువ అక్షరాలా × రూ. 533 కోట్లకు పైగా ఉంటుందని రక్షణ శాఖ



లెక్కగట్టింది. గండిపేట, రాజేంద్రనగర్, గోల్కొండ మండలాల పరిధిలోని బండ్లగూడ, హైదర్‌గూడ, ఖిల్లా మహ్మద్ నగర్ గ్రామాల్లో విస్తరించి ఉన్న పాకెట్ 2 ౘ 3, పాకెట్ 4, పాకెట్ 5, పాకెట్ 6ం భూములను ఈ గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కేటాయించారు. ఈ భూముల బదిలీ ప్రక్రియను రక్షణ శాఖ ఒక ప్రత్యేక నిబంధనపై మంజూరు చేసింది. ఈక్వల్ వాల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విధానం ప్రాతిపదికన ఈ వర్కింగ్ పర్మిషన్ లభించింది. అంటే.. రక్షణ శాఖకు చెందిన లోకల్ మిలిటరీ అథారిటీ కి ఈ భూమికి బదులుగా సమాన విలువ కలిగిన మౌలిక సదుపాయాలను భవనాలు, రోడ్లు లేదా ఇతర మౌలిక వసతులు రాష్ట్ర ప్రభుత్వం నిర్మించి ఇవ్వాల్సి ఉంటుంది. రక్షణ శాఖ 2016 నాటి పాలసీ నిబంధనల ప్రకారం ఈ ఒప్పందం కుదిరింది. మూసి నది , ఈసీ నదులు సంగమించే లొకేషన్‌లో ఉన్న బాపు ఘాట్ వద్ద ఈ గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతోంది. మహాత్మా గాంధీ అస్థికలను కలిపిన పవిత్ర స్థలమైన బాపు ఘాట్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ సంకల్పం. ఇక్కడ భారీ జలాశయం తో పాటు గాంధీజీ సిద్ధాంతాలను ప్రతిబింబించేలా విజ్ఞాన కేంద్రాలు, సుందరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, మరియు పర్యాటకులను ఆకట్టుకునేలా బోటింగ్ సౌకర్యాలను నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి లభించిన ఈ క్లియరెన్స్‌తో మూసి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనుల వేగం పుంజుకోనుంది. గతంలో రక్షణ భూముల సేకరణ పెద్ద అడ్డంకిగా మారగా, ఇప్పుడు కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించి పచ్చజెండా ఊపడంతో ప్రాజెక్టు డిజైన్ల అమలుకు మార్గం సుగమమైంది. కేవలం పర్యాటక రంగమే కాకుండా నగరంలోని పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి, మూసి నదిని మురికికూపంగా మార్చే డ్రైనేజీ ప్రవాహాలను అడ్డుకుని, స్వచ్ఛమైన జలాలతో ఈ సరోవరాన్ని నింపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# 60 ఏళ్లలో ఆరు చీలికలు

ముంబై, జూన్ 19, (న్యూస్ పల్స్)శివసేన స్థాపించి 60 సంవత్సరాలు నిండబోతోంది. సరిగ్గా 60 వ వ్యవస్థాపక దినోత్సవం దగ్గరపడుతున్న వేళ పార్టీ చీలిక అనే ముప్పును తీవ్రంగా ఎదుర్కొంటోంది. తన వర్గ ప్రజా ప్రతినిధులను వదిలంగా వుంచుకోవడానికి ఉద్ధవ్ నానా కష్టాలు పడుతున్నారు. 1966లో బాల్ థాకరే దీనిని స్థాపించినప్పటి నుండి, శివసేన తన దూకుడు హిందుత్వ, ప్రాంతీయ గుర్తింపు రాజకీయాలకు ప్రసిద్ధి చెందింది. కానీ అంతర్గత కలహాలు, అగ్ర నాయకుల నిష్క్రమణ పార్టీకి సవాల్ గా మారాయి. 1991 నుండి 2022 వరకు శివసేన ప్రతి దశాబ్దంలోనూ భారీ ఎదురుదెబ్బలను ఎదుర్కొంది. 1991 ఛగన్ భుజ్ బల్ సారథ్యంలో తిరుగుబాటు? 1991 ఛగన్ భుజ్ బల్ సారథ్యంలో శివసేన అతిపెద్ద తిరుగుబాటును ఎదుర్కొంది. యన 17 మంది ఎమ్మెల్యేలతో కలిసి పార్టీని వీడి, శరద్ పవార్ వర్గంలో చేరారు. తర్వాతి కాలంలో, కాంగ్రెస్-ఎన్‌సీపీ ప్రభుత్వాలలో ఉప ముఖ్యమంత్రి మరియు హోం మంత్రి వంటి కీలక పదవులను ఆయన చేపట్టారు. ఆయన నిష్క్రమణ తర్వాత సంస్థాగతంగా పార్టీకి సవాల్ గా నిలిచింది. 1999 లో గణేష్ నాయక్: నవీ ముంబైలో బలమైన పట్టు కలిగిన గణేష్ నాయక్, వ్యక్తిగత ఆశయాల కారణంగా శివసేనను వీడి ఎన్‌సీపీలో చేరారు. ఎన్‌సీపీలో దాదాపు రెండు దశాబ్దాల పాటు కొనసాగిన తర్వాత, 2019లో ఆయన బీజేపీలో చేరారు; ఇప్పటికీ నవీ ముంబై రాజకీయాల్లో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. 2004: నారాయణ్ రాణే? ఉద్ధవ్ థాకరేతో విభేదాల కారణంగా మాజీ ముఖ్యమంత్రి నారాయణ్ రాణే శివసేనను వీడారు. కాంగ్రెస్ మరియు తన సొంత పార్టీ అయిన 'స్వాభిమాన్ పార్టీ'లో కొంతకాలం కొనసాగిన తర్వాత, చివరకు ఆయన బీజేపీలో చేరారు. ప్రస్తుతం కొంకణ్ ప్రాంతంలో బీజేపీకి ఆయన ఒక బలమైన నాయకుడిగా ఉన్నారు. 2007 రాజ్ థాకరే? ఇది నష్టం నేరుగా థాకరే కుటుంబానికే తగిలింది. బాల్ థాకరే క్రియాశీల రాజకీయాల నుండి తప్పుకుని, శివసేనను తన కుమారుడు ఉద్ధవ్ థాకరేకు అప్పగించడంతో, మేనల్లుడు రాజ్ థాకరే తిరుగుబాటు చేశారు. కుటుంబంలోని అంతర్గత విభేదాలు, ఉద్ధవ్ థాకరే పెరుగుతున్న ప్రాబల్యం పట్ల అసంతృప్తితో, రాజ్ థాకరే శివసేనను వీడి మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్)ను స్థాపించారు. ఆరంభంలో ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ, పార్టీ తన రాజకీయ పట్టును నిలబెట్టుకోవడంలో విఫలమై, ప్రస్తుతం ఎన్నికల పరంగా నామమాత్రపు పార్టీగా మిగిలిపోయింది. రాజ్ నిష్క్రమణ శివసేన కీలక బలాన్ని చీల్చిన సైద్ధాంతిక మరియు కుటుంబ విభేదంగా పరిగణించబడింది. 2022: ఏక్‌నాథ్ షిండే?.

ఏకనాథ్ షిండే కేవలం తిరుగుబాటే చేయలేదు. ఏకంగా పార్టీని చీల్చేశారు. శివసేనను రెండుగా చీల్చేశారు. 2022లో ఏక్‌నాథ్ షిండే పార్టీని అధికారికంగా విభజించారు. అత్యధిక సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎంపీలు షిండేతో కలిసి బయటకు వచ్చారు. గతంలో జరిగిన ఇలాంటి పరిణామాలన్నింటితో పోలిస్తే, షిండే తిరుగుబాటు ప్రభావం చాలా లోతైనదిగా ఉంది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనను న్యాయపరమైన మరియు సంస్థాగత సంక్షోభంలోకి నెట్టివేసింది. తిరుగుబాటు ఉధృతంగా ఉన్న సమయంలో, షిండేతో పాటు 40 నుండి 46 మంది ఎమ్మెల్యేలు గౌహతిలో బస చేశారు. షిండే వర్గం బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, అధికారిక శివసేనగా గుర్తింపు పొంది, పార్టీ పేరు మరియు 'విల్లు-బాణం' ఎన్నికల గుర్తును దక్కించుకుంది. 2026 లో??..??ఉద్ధవ్ థాకరేను వీడి ఏక్‌నాథ్ షిండే వైపు ఎంపీలు వెళ్లడం ద్వారా 2022 నాటి పరిస్థితులు పునరావృతమవుతాయా? లేక ఆ సంక్షోభాన్ని ఉద్ధవ్ థాకరే అడ్డుకోగలరా? వేచి చూడాల్సిందే

## తమిళనాడులో అప్పుల భారం

### ప్రతి చిన్నారిపై లక్షా 28 వేలు

చెన్నై, జూన్ 19, (న్యూస్ పల్స్)తమిళనాడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి మేరీ విల్సన్ ఈ పత్రంలో వెల్లడించారు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక దుస్థితిని వివరిస్తూనే, మరోవైపు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ రుణమాఫీని సీఎం విజయ్ ప్రకటించారు. రాష్ట్ర ఖజానా పరిస్థితి ఎంత దారుణంగా ఉందో వివరిస్తూ ప్రభుత్వం పలు సంచలన గణాంకాలను బయటపెట్టింది: భారీగా అప్పులు: రాష్ట్ర మొత్తం అప్పులు రికార్డు స్థాయిలో రూ.13.18 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇందులో డైరెక్ట్ (ప్రత్యక్ష) రుణాలే ఏకంగా రూ.10 లక్షల కోట్ల వరకు ఉన్నాయి. రెట్టింపైన రుణాలు: ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని గత ఐదేళ్ల పాలనలోనే అప్పులు దాదాపు రెట్టింపయ్యాయి. డీఎంకే అధికారంలోకి రాకముందు రూ.4.8 లక్షల కోట్లుగా ఉన్న ప్రత్యక్ష రుణాలు, కేవలం ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లకు పైగా పెరిగాయి. చిన్నారిపై భారం: అప్పుల పెరుగుదల కారణంగా.. ప్రస్తుతం తమిళనాడులో పుట్టే ప్రతి పిల్లాడి తలపై సగటున రూ.1.28 లక్షల రుణ భారం ఉంది. అభివృద్ధి శూన్యం: గత ఆరు దశాబ్దాల్లో చేసిన అప్పులకంటే ఈ ఐదేళ్లలోనే ఎక్కువ అప్పులు చేశారని, వాటిని మౌలిక సదుపాయాల కల్పనకు కాకుండా కేవలం రోజువారీ ఖర్చులకే వినియోగించారని ఆర్థిక మంత్రి మేరీ విల్సన్ తీవ్రంగా విమర్శించారు. బడ్జెటేతర రుణాలు, ప్రభుత్వ గ్యారంటీలు అన్నీ కలుపుకుంటేనే మొత్తం అప్పు రూ.13.18 లక్షల కోట్లకు చేరిందని ఆయన స్పష్టం చేశారు. అన్నదాతలకు ఊరటరాష్ట్రం ఆర్థిక కష్టాల్లో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి విజయ్ రైతులకు భారీ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకున్నారు. సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన కీలక సమావేశం అనంతరం రుణమాఫీని అధికారికంగా ప్రకటించారు. గతేడాది మే 1 నుంచి ఈ ఏడాది (2026) ఫిబ్రవరి 28 మధ్య సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు ఈ మాఫీ వర్తిస్తుంది. వాస్తవానికి గత నెలలో రూ.50 వేల లోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పలు రైతు సంఘాలు ముఖ్యమంత్రిని కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు ఆ పరిమితిని రూ.75 వేలకు పెంచుతూ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ రూ.75 వేల కంటే ఎక్కువ రుణం తీసుకున్న రైతులు ఉంటే, వారికి సైతం ఏకమొత్తంగా రూ.35 వేల వరకు రుణాన్ని మాఫీ చేస్తారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 14.43 లక్షల మంది రైతులుకు లబ్ధి చేకూరనుంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై అదనంగా సుమారు రూ.5,932 కోట్ల భారం పడనుంది.

## దేశంలో కార్ టెక్నాలజీ

### రోడ్డు ప్రమాదాలకు చెక్...

ముంబై, జూన్ 19, (న్యూస్ పల్స్)భారతదేశంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆటోమొబైల్ రంగంలో మరో విప్లవాత్మక అడుగు వేసింది. రహదారులపై ప్రయాణించే వాహనాలు ఒకదానితో ఒకటి నేరుగా సమాచారాన్ని పంచుకునే సరికొత్త 'వాహనం-వాహనం కమ్యూనికేషన్' వ్యవస్థ అమలు చేసేందుకు సిద్ధమైంది. ఈ అత్యాధునిక టెక్నాలజీకి సంబంధించిన ముసాయిదా నిబంధనలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ సాంకేతికత ద్వారా రోడ్డుపై వెళ్తున్న వాహనాలు ఒక ప్రత్యేకమైన రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా అనుసంధానమై ఉంటాయి. వాహనాలు తమ వేగం, ప్రయాణిస్తున్న దిశ (లొకేషన్), బ్రేకింగ్ పరిస్థితి వంటి కీలక సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీపంలోని ఇతర వాహనాలకు చేరవేస్తాయి. ముందు వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేసినా, రోడ్డుపై మలుపుల వద్ద ఏదైనా వాహనం నిలిచిపోయినా.. ఈ సిస్టమ్ వెంటనే వెనుక వస్తున్న డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది. వాతావరణం అనుకూలించని సమయాల్లో (పొగమంచు/భారీ వర్షం) లేదా డ్రైవర్ కంటికి కనిపించని (బ్లైండ్ స్పాట్స్) ప్రమాదాలను కూడా ముందుగానే పసిగట్టి ఇది అలర్ట్ ఇస్తుంది. దీనికోసం టెలికమ్యూనికేషన్స్ శాఖ ఇప్పటికే ఈ వాహనాల కమ్యూనికేషన్ కోసం ఒక ప్రత్యేకమైన రేడియో ఫ్రీక్వెన్సీని కేటాయించడం గమనార్హం. ఈ సరికొత్త సేఫ్టీ టెక్నాలజీ భారతీయ రవాణా రంగంలో ఒక 'విప్లవాత్మక మార్పు' అని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అభివర్ణించారు. ఈ వీ2వీ కమ్యూనికేషన్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తే.. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను ఏకంగా 80 శాతం వరకు తగ్గించే అద్భుతమైన సామర్థ్యం దీనికి ఉందని చెప్పారు. అంచనా వ్యయంఈ పరికరాన్ని (డివైజ్) ముందుగా కొత్తగా తయారయ్యే కార్లు, బస్సులు, ట్రక్కులతో పాటు ద్విచక్ర (టూ-వీలర్) వాహనాల్లో అమర్చడాన్ని కేంద్రం తప్పనిసరి చేసే అవకాశముంది. తొలిదశ విజయవంతమైన అనంతరం, రోడ్లపై ఇప్పటికే తిరుగుతున్న పాత వాహనాల్లో కూడా ఈ టెక్నాలజీని అమర్చేందుకు వీలుగా ప్రభుత్వం భవిష్యత్తులో ప్రత్యేక నిబంధనలను తీసుకురానుంది. ఒక్కో వీ2వీ పరికరం తయారీ, అమర్చడానికి సుమారు రూ. 5,000 నుంచి రూ. 7,000 మధ్య ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా. రాబోయే సంవత్సరాల్లో రోడ్డు భద్రతా ప్రమాణాలను పెంచడంలో ఈ నిర్ణయం ఒక కీలక మలుపుగా మారనుందని ఆటోమొబైల్ రంగ నిపుణులు భావిస్తున్నారు.

## మ్యారేజ్ పై వార్ ఎఫెక్ట్...


హైదరాబాద్, జూన్ 19, (న్యూస్ పల్స్)తెలుగు రాష్ట్రాల్లో శుభకార్యాల సీజన్ మళ్లీ మొదలైంది. అధిక జేష్ట మాసం ముగిసింది. దీంతో శుభకార్యాలు మొదలయ్యాయి. జూలై 9 వరకు వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలకు సంబంధించి అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. దాదాపు నెల రోజుల తర్వాత మళ్లీ శుభకార్యాల సీజన్ మొదలైంది. ఈనెల 15 నుంచి జూలై 9 వరకు పరిమిత శుభ ముహూర్తాలు ఉండడంతో.. వివాహాలు, గృహప్రవేశాలకు ముహూర్తాలు డిసైడ్ చేస్తున్నారు. జూలై 15 నుంచి ఆషాడమాసం, గురు మూఢం ప్రారంభం అవుతుంది. మళ్లీ ఆగస్టు 15 వరకు ముహూర్తాలు లేవు. మళ్లీ శ్రావణమాసంలోనే ముహూర్తాలు ఉన్నాయి. జూలై 9లోపు వేలాది వివాహాలు నిశ్చయం అయినట్లు తెలుస్తోంది తెలుగు రాష్ట్రాల్లో. జూన్ తో పాటు జూలై నెలలో ఈ ముహూర్తాలు కొనసాగనున్నాయి. ప్రధానంగా జూన్ 19, 20, 21, 22, 24, 25, 26, 27, 28 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మరోవైపు జూలైలో 1, 6, 7, 9 తేదీలు కూడా ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. పరిమిత ముహూర్తాలు కావడంతో అటు పురోహితులు, ఫంక్షన్ హాల్, క్యాటరింగ్ కు విపరీతమైన డిమాండ్ ఉంది. ముఖ్యంగా పురోహితులను ముందే మాట్లాడుకుంటున్నారు. మార్కెట్లో అన్ని రకాల ధరలు పెరిగాయి. దానికి కారణం యుద్ధం గా చూపుతున్నారు.

## కల్తీ నియంత్రణకు కొత్త ఫోర్స్

హైదరాబాద్, జూన్ 19, (న్యూస్ పల్స్)ప్రస్తుతం మార్కెట్‌లో ఏ వస్తువు చూసినా కల్తీమయంగా మారిపోయింది. తినే తిండి దగ్గరి నుంచి తాగే నీటి వరకు అన్నీ కల్తీలు చేస్తున్నారు. ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులను కల్తీ చేసి.. కొందరు కేటుగాళ్లు భారీగా సొమ్మును వెనకేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ వస్తువులోనూ కల్తీ జాడలు ఉండటంపై సర్కార్ సీరియస్‌గా పరిగణించింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న కల్తీలకు చెక్ పెట్టేందుకు ఏకంగా ఒక స్పెషల్ ఫోర్స్‌ను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నిత్యావసర వస్తువుల కల్తీ ముఠాల ఆటకట్టించేందుకు ఈ స్పెషల్ ఫోర్స్ చర్యలు చేపట్టనుంది. హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆక్రమణలు, చెరువులు కుంటల్లో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ.. పెను సంచలనం సృష్టిస్తూ.. కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న హైడ్రా .. డ్రగ్స్, గంజాయి సహా మత్తు పదార్థాల ముఠాల పాలిట శత్రువుగా మారిన ఈగల్ ఫోర్స్ లాగానే వస్తువుల్లో కల్తీని నియంత్రించేందుకు ఒక పవర్‌ఫుల్ స్పెషల్ ఫోర్స్ ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టింది. అయితే ఈ స్పెషల్ ఫోర్స్ కేవలం తనిఖీలు మాత్రమే చేయకుండా.. కల్తీ కేటుగాళ్లపై సెర్చ్ అండ్ సీజ్ ఆపరేషన్లు నిర్వహించడం, వారికి భారీగా జరిమానాలు విధించేలా విశేషమైన అధికారాలను కట్టబెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్, హెల్త్, పోలీస్ శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేయనున్న ఈ స్పెషల్ ఫోర్స్‌కు ఒక సీనియర్ ఐపీఎస్ అధికారిని బాస్‌గా నియమించే ఆలోచనను రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఈ స్పెషల్ ఫోర్స్ ఏర్పాటుకు సంబంధించి.. ఇప్పటికే సమగ్ర ప్రతిపాదనలు రెడీ అయ్యాయి. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఏ రకంగా ఉక్కుపాదం మోపుతోందో.. అదే విధంగా కల్తీ దందాపైనా దూకుడుగా వ్యవహరించేలా ఈ కొత్త ఫోర్స్‌ను తయారు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌లో తక్కువ మంది సిబ్బంది ఉండటంతోపాటు.. వారికి నామమాత్రపు అధికారాలు ఉండటంతో కల్తీగాళ్ల ఆటకట్టించడంలో సఫలం కాలేకపోతున్నారు. అదే సమయంలో కల్తీ చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని నిందితులు తప్పించుకుంటున్నారు. ఇలాంటివి దృష్టిలో పెట్టుకుని.. ఆ స్పెషల్ ఫోర్స్‌కు సర్వాధికారాలు కల్పించాలని సర్కార్ భావిస్తోంది. మార్కెట్లో దొరికే పాలు, నూనెలు, మసాలాల దగ్గరి నుంచి హోటళ్లలో లభించే ఆహార పదార్థాల వరకు ప్రతి ఒక్క వస్తువుపై ఈ ఫోర్స్ నిరంతర నిఘా పెట్టనుంది. ఈ స్పెషల్ ఫోర్స్‌కు ఆయా వస్తువుల శాంపిల్స్ సేకరించే అధికారం మాత్రమే కాకుండా.. నేరుగా ఆ వస్తువుల తయారీ కేంద్రాలపై దాడులు చేయడం.. ఆ వస్తువులు, సంబంధిత హోటల్‌ను కూడా సీజ్ చేసేలా చట్టపరంగా అధికారాలు ఇవ్వనున్నారు. కల్తీకి పాల్పడే వారి లైసెన్సులను రద్దు చేయడంతోపాటు వారికి రూ.కోట్లల్లో పెనాల్టీలు విధించి.. ఇంకోసారి అలాంటి కల్తీలకు పాల్పడకుండా చూసేలా రూల్స్‌ను కఠినతరం చేస్తున్నారు. ఈ కల్తీల వెనుక ఎంతటి పెద్ద వారి అండదండలు ఉన్నా.. వదిలిపెట్టకూడదనే స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నారు. కల్తీ వస్తువుల నిందితులపై నాన్ బెయిలెబుల్ కేసులు పెట్టేలా ఆ స్పెషల్ ఫోర్స్‌కు ప్రత్యేక న్యాయ విభాగాన్ని కూడా అనుసంధానం చేయనున్నారు. ఈ క్రమంలోనే ఈ స్పెషల్ ఫోర్స్‌ను ఎలా తయారు చేయాలి.. దానికి నిధుల కేటాయింపు, చట్టపరమైన అధికారాలకు సంబంధించి సుదీర్ఘ చర్చ జరిపి రిపోర్ట్‌ను రెడీ చేశారు. త్వరలోనే ఆ రిపోర్ట్‌కు కేబినెట్ ఆమోద ముద్ర వేసి.. అమల్లోకి తీసుకువచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

## ప్రమాదకరంగా క్యాట్ ఫిష్

మహబూబ్ నగర్, జూన్ 19 (న్యూస్ పల్స్)ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే క్యాట్‌ఫిష్ పెంపకంపై ప్రభుత్వ నిషేధం ఉన్నప్పటికీ వనపర్తి జిల్లాలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఒక్క పెబ్బేరు మండలంలోనే 30కి పైగా అక్రమ చెరువులు వెలిసినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. వీటికి కుళ్లిన చికెన్ వేస్టేజీని ఆహారంగా వేస్తుండటంతో చుట్టుపక్కల పొలాలు దుర్వాసనతో నిండిపోతున్నాయి. తక్కువ ఖర్చుతో కోట్లు సంపాదించవచ్చుననే ఆశతో ఏపీకి చెందిన కొందరు వ్యాపారులు ఇక్కడ చేపలను పెంచి విజయవాడ, వైజాగ్, బెంగళూరులకు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పు తెచ్చిపెడుతుందనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాట్‌ఫిష్ (ఆఫ్రికన్ మాగుర్) పెంపకంపై దేశవ్యాప్తంగా కఠినమైన నిషేధం విధించాయి. అయితే.. చట్టాల పట్ల ఏమాత్రం భయం లేకుండా, అధికారుల కళ్లు గప్పి వనపర్తి జిల్లాలో క్యాట్ ఫిష్ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆసరాగా చేసుకుని.. కేవలం ఒక్క పెబ్బేరు మండలంలోనే 30కి పైగా క్యాట్‌ఫిష్ పెంపకం చెరువులను ఏర్పాటు చేశారు. దీంతో పాటు నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లోనూ ఈ రకమైన నిషేధిత చేపల చెరువులు జోరుగా సాగుతున్నాయి. గతంలో మత్స్యశాఖ అధికారులు నామమాత్రంగా కొన్ని చెరువులను ధ్వంసం చేసి చేతులు దులుపుకోవడంతో నిర్వాహకులు మళ్లీ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, పెబ్బేరు మున్సిపాలిటీల పరిధిలోని చికెన్ సెంటర్ల నుంచి సేకరించే వ్యర్థాలను ఈ క్యాట్‌ఫిష్‌లకు ప్రధాన ఆహారంగా



వాడుతున్నారు. వనపర్తి జిల్లా కేంద్రం నుంచే ప్రతిరోజూ దాదాపు 15 మెట్రిక్ టన్నుల చికెన్ వ్యర్థాలను సేకరించేందుకు టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు, ఆ చెత్తను మున్సిపల్ యార్డులకు తరలించకుండా ఈ అక్రమ పెంపకందారులకు అమ్మేస్తున్నారు. సాధారణ దాణా కంటే ఈ కుళ్లిన మాంసాన్ని తినడం వల్ల క్యాట్‌ఫిష్‌లు చాలా తక్కువ కాలంలోనే ఊహించని విధంగా బరువు పెరుగుతాయి. ఇతర రకాల చేపలేవీ ఈ మాంస వ్యర్థాలను ముట్టవు. అయితే.. టన్నుల కొద్దీ చికెన్ వ్యర్థాలను చెరువుల వద్ద కుప్పలుగా వేస్తుండటంతో చుట్టుపక్కల ప్రాంతాలు నరకప్రాయంగా మారుతున్నాయి. తీవ్రమైన దుర్వాసనతో ఊపిరి పీల్చుకోలేకపోతున్నామని, పంట పొలాల్లో పనులు చేసుకోలేకపోతున్నామని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ దందాను నడిపిస్తోంది పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు బడా ఆక్వా వ్యాపారులని సమాచారం. వనపర్తిలోనే పదుల సంఖ్యలో చెరువులను లీజుకు తీసుకుని స్థానిక యంత్రాంగాన్ని మేనేజ్ చేస్తూ వీరు కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. సాధారణ చేపలు మార్కెట్లో కిలో రూ. 150 వరకు పలుకుతుండగా.. ఈ క్యాట్‌ఫిష్‌లను హోల్‌సేల్‌గానే కిలో రూ. 100 పైచిలుకు ధరకు అమ్ముతున్నారు. ఇక్కడ పెంచిన చేపలను విజయవాడ, విశాఖపట్నం, రాయలసీమ జిల్లాలతో పాటు బెంగళూరు మహానగరానికి భారీ కంటైనర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. క్యాట్‌ఫిష్‌లను తినడం వల్ల మానవులలో క్యాన్సర్, కాలేయ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి టాస్క్‌ఫోర్స్ రంగాన్ని రంగంలోకి దింపి ఈ చెరువులను శాశ్వతంగా మూసివేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

## సమాజ్ వాదీ పార్టీ లో చీలిక తప్పదా

లక్నో, జూన్ 19, (న్యూస్ పల్స్)తృణమూల్ కాంగ్రెస్ లో చీలికలు, శివసేన ఉద్ధవ్ వర్గంలో చీలికలు.. తాజాగా మరో పార్టీ కూడా చీలిక దిశగా ప్రయాణిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే సమాజ్ వాదీ పార్టీ. యూపీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ వార్త పెద్ద సంచలనం రేపుతోంది. సమాజ్ వాదీ ఎంపీలంతా బీజేపీ వైపు చూస్తున్నట్లు మంత్రి ఓం ప్రకాశ్ రాజ్ భర్ పెద్ద బాంబు పేల్చారు. దీంతో దేశ రాజకీయాలు ఆసక్తిగా మారాయి. సమాజ్ వాదీ పార్టీలో భారీ చీలిక తప్పదని, ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ఇప్పటికే బీజేపీ వైపు వెళ్లేందుకు సిద్ధంగా వున్నారంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మహారాష్ట్రపైనే దృష్టి పెట్టొద్దని, ఇప్పుడు యూపీ వంతు వచ్చిందంటూ వ్యాఖ్యానించారు. ఎవరైనా కొనుగోలు కావడానికి సిద్ధంగా వుంటేనే వారిని ఎవరైనా కొనుగోలు చేస్తారు. మహారాష్ట్ర గురించే కాకుండా యూపీ పై కూడా దృష్టి నిలపాలని మంత్రి అందులో పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు, అఖిలేష్ యాదవ్ బాబాయి అయిన రామ్ గోపాల్ యాదవ్ ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి ఒక లేఖను అందజేశారని, ఆ లేఖ పార్టీలోని ఒక వర్గం బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై సమాజ్‌వాదీ పార్టీ నుండి బీజేపీ నుంచి ఎటువంటి స్పష్టతా రాలేదు. తృణమూల్ కాంగ్రెస్ శివసేన లో జరిగినట్లుగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన సమాజ్‌వాదీ పార్టీలో ప్రస్తుతం చీలిక వచ్చే అవకాశం లేదని అక్కడి రాజకీయ పరిశీలకులు మరియు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఇటీవల కొన్ని అంతర్గత విభేదాలు మాత్రం వున్నట్లు సమాచారం. 027 ఎన్నికలకు ముందు టికెట్ల కేటాయింపు విషయంలో కొందరు నాయకుల మధ్య అసంతృప్తి తలెత్తే అవకాశం ఉందని, ఇది పార్టీ మరియు అఖిలేష్ ప్రణాళికలకు విఘాతం కలిగించవచ్చని వారు భావిస్తున్నారు. గత రాజ్యసభ ఎన్నికల్లో జరిగిన క్రాస్-వోటింగ్ ఉదంతాలతో కూడా పరిశీలకులు దీనిని ముడిపెడుతున్నారు. సమాజ్ వాదీ పార్టీ తక్షణమే చీలిక వచ్చే సూచనలేవీ కనిపించనప్పటికీ, రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలు మాత్రం ఖచ్చితంగా ఒక రకమైన ప్రకంపనలను రేకెత్తించాయి. ఏది ఏమైనా, రాజకీయాల్లో ఏం జరుగుతుందో అంచనా వేయడం కష్టం; ఎప్పుడు మిత్రులు అకస్మాత్తుగా శత్రువులుగా మారుతారో, లేదా ఎప్పుడు చిరకాల రాజకీయ ప్రత్యర్థులు ఊహించని విధంగా మిత్రులుగా మారతారో ఎవరూ చెప్పలేం. అయితే, ఒకవేళ ఎస్పీ లో చీలిక ఏర్పడితే, దాని ప్రభావం ప్రధానంగా వచ్చే ఏడాది? అంటే 2027లో? జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై పడుతుంది. అంతేకాకుండా, పార్లమెంటరీ సమీకరణాలు కూడా మారవచ్చు. ప్రస్తుతం రాజ్యసభలో ఎస్పీ ప్రధాన ప్రతిపక్ష పార్టీలలో ఒకటిగా ఉంది, అలాగే రామ్ గోపాల్ యాదవ్ ఆ పార్టీకి చెందిన ప్రముఖ వ్యక్తి మరియు బలమైన గొంతుకగా ఉన్నారు. రాజ్యసభలో సమాజ్‌వాదీ పార్టీకి మొత్తం నలుగురు ఎంపీలు ఉన్నారు. ఒకవేళ పెద్ద సంఖ్యలో రాజ్యసభ ఎంపీలు పార్టీ మారితే, సభలో ప్రతిపక్షం బలహీనపడి, ప్రభుత్వం తన బిల్లులను సులభంగా ఆమోదించుకునే అవకాశం ఏర్పడుతుంది.

## 9 రోజుల పాటు ఆధ్యాత్మిక యాత్ర

### 33 శాతం తక్కువ ధర

బెంగళూరు, జూన్ 19, (న్యూస్ పల్స్)దేశంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రాలను ఒకే ప్రయాణంలో దర్శించాలనుకునే భక్తులకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక అవకాశం కల్పిస్తోంది. ఉత్తర భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను కవర్ చేసే ప్రత్యేక తీర్థయాత్ర ప్యాకేజీని ప్రకటించింది. ఈ యాత్ర ద్వారా కాశీ, అయోధ్య, గయ, బోధ్‌గయ, ప్రయాగ్‌రాజ్ వంటి పవిత్ర ప్రదేశాలను సందర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందవచ్చు. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా నిర్వహించే ఈ యాత్ర సెప్టెంబర్ 9, 2026న ప్రారంభమై సెప్టెంబర్ 17న ముగియనుంది. మొత్తం తొమ్మిది రోజుల పాటు కొనసాగే ఈ టూర్‌లో ప్రయాణికులకు దర్శనాలు, వసతి, భోజనం వంటి అన్ని ప్రధాన సదుపాయాలు కల్పిస్తారుఈ ప్రత్యేక రైలు తమిళనాడులోని తిరునెల్వేలి నుంచి బయలుదేరనుంది. మార్గమధ్యంలో విరుదునగర్, మదురై, దిండిగల్, తిరుచిరాపల్లి, విల్లుపురం, చెంగల్పట్టు, తాంబరం, చెన్నై ఎగ్మోర్, గూడూరు వంటి స్టేషన్లలో ప్రయాణికులు ఎక్కవచ్చు. భారత రాష్ట్రాల భక్తులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. గయ, బోధ్‌గయలో పుణ్యస్నానం లాంటి అనుభూతియాత్రలో మొదట గయ క్షేత్రాన్ని సందర్శించే అవకాశం ఉంటుంది. అక్కడ విష్ణుపాద ఆలయంలో ప్రత్యేక దర్శనం నిర్వహిస్తారు. అనంతరం బౌద్ధమతానికి అత్యంత పవిత్రమైన బోధ్‌గయలోని మహాబోధి ఆలయాన్ని సందర్శిస్తారు. ఈ ప్రాంతాల్లో భక్తుల కోసం వసతి, రవాణా ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేస్తారు. కాశీలో దివ్య దర్శనాలుప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక నగరమైన వారణాసిలో భక్తులకు కాశీ విశ్వనాథ స్వామి దర్శనం కల్పిస్తారు. అలాగే అన్నపూర్ణ దేవి ఆలయం, విశాలాక్షి అమ్మవారి ఆలయం, కాలభైరవ ఆలయాలను కూడా సందర్శించే అవకాశం ఉంటుంది. సాయంత్రం గంగా నదీ తీరంలో జరిగే గంగా హారతి యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. శ్రీరాముడి జన్మస్థల దర్శనంతదుపరి అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయాన్ని సందర్శిస్తారు. అక్కడి ప్రధాన దేవాలయాలు, పుణ్యస్థలాలను యాత్రికులకు చూపిస్తారు. ప్రయాగ్‌రాజ్ చేరుకుని త్రివేణి సంగమం, ప్రసిద్ధ హనుమాన్ ఆలయాన్ని దర్శించే కార్యక్రమం ఉంటుంది.

# సీఎం ప్రజావాణి " లో ప్రజల సమస్యల పరిష్కారం బాగుంది

### ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కితాబు



హైదరాబాద్,బేగంపేట్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరుగుతున్న " సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి " ని భువనగిరి ఎం.పీ. చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణిలోని ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి డెస్క్ అధికారులతో కిరణ్ కుమార్ రెడ్డి ఇంటరాక్ట్ అయ్యారు. ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును, ప్రజలు అందిస్తున్న అర్జీల పరిష్కారం తీరును చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీఎం ప్రజావాణిలో ప్రజల సమస్యలు 74 శాతం పరిష్కారం కావడం పట్ల చామల కిరణ్ కుమార్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరింత పక్కాగా ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రజావాణి అధికారులకు సూచించారు. సీఎం ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, వివిధ శాఖల అధికారులు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి సీఎం ప్రజావాణి అమలు తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ ఐ సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు నంగి దేవేందర్ రెడ్డి, పద్మా రాణి కర్రి, తదితరులు పాల్గొన్నారు.

# కవ్వంపల్లి ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కరీంనగర్ , కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ లో కాంగ్రెస్ పక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం గాంధీ భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే మనందరి లక్ష్యం కావాలన్నారు. ఈ దిశగా పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో గట్టి కృషి చేయాలన్నారు. దేశ రాజకీయాల్లో విలువలతో కూడిన నాయకత్వానికి రాహుల్ గాంధీ ప్రతీకగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటం, సామాజిక న్యాయం సాధన కోసం ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో దేశానికి దూరదృష్టి కలిగిన, ప్రజల సంక్షేమం పట్ల అంకితభావంతో పనిచేసే నాయకత్వం అవసరమని, ఆ లక్షణాలన్నీ రాహుల్ గాంధీలో మెండుగా ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశంలోని యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను పార్లమెంట్‌తో పాటు ప్రజల మధ్యకు తీసుకెళ్లిన నాయకుడు రాహుల్ గాంధీయేనని అన్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్రల ద్వారా దేశ ప్రజల్లో ఐక్యత, సోదరభావం, సామాజిక సమానత్వం సందేశాన్ని బలంగా చాటారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి, రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరెపల్లి రాజేందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, జగన్, వినోద్ సింగ్,నర్సింహ,ఓం ప్రకాశ్, చంద్రయ్య, చంద్రశేఖర్ తోపాటు పలు జిల్లా అధ్యక్షులు, బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ రీఎగ్జామ్ విద్యార్థులకు.. వాట్సాప్‌లో అలర్ట్ మెసేజ్‌లు

న్యూఢిల్లీ: నీట్ యూజీ పరీక్ష మళ్లీ రాయబోతున్న విద్యార్థుల కోసం.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వాట్సాప్ ద్వారా అలర్ట్ మెసేజ్‌లను జారీ చేసింది. నీట్ రీఎగ్జామ్ రాయనున్న విద్యార్థులకు వెరిఫైడ్ వాట్సాప్ అకౌంట్ నుంచి మాత్రమే ఆ సందేశాలు వెళ్తున్నాయి. జూన్ 21వ తేదీన నీట్ యూజీ రీఎగ్జామ్‌ను నిర్వహించనున్న విషయం తెలిసిందే. విద్యార్థులకు కచ్చితమైన, నమ్మకమైన సమాచారాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో వాట్సాప్ ద్వారా ఎగ్జామ్ సెంటర్లు, అడ్మిట్ కార్డులను జారీ చేస్తున్నారు. ఫేక్ మెసేజ్‌లు, ఆన్‌లైన్ స్కామ్‌ల నుంచి విద్యార్థులను రక్షించే ఉద్దేశంతో ఈ చర్యకు దిగారు.ఎన్టీఏ సంస్థ +91 78279 80287 నెంబర్‌ను వాట్సాప్ వెరిఫైడ్ అకౌంట్‌గా ప్రకటించింది. ఆ నెంబర్ నుంచి వచ్చే మెసేజ్‌లను మాత్రమే విద్యార్థులు నమ్మాలని ఎన్టీఏ తన ప్రకటనలో తెలిపింది. ఆ నెంబర్‌కు బ్లూ వెరిఫికేషన్ టిక్ ఉంటుందని, దానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అని పేరు కూడా ఉంటుందని ఎన్టీఏ పేర్కొన్నది. ఎన్టీఏ నుంచి మెసేజ్ పంపిస్తున్నామని చెప్పి, దానికి వెరిఫైడ్ బ్యాడ్జ్ లేకుంటే, అది అనుమానిత మెసేజ్‌గా భావించాలని ఎన్టీఏ తన ప్రకటనలో చెప్పింది. వాట్సాప్ సర్వీస్ అనేది వన్ వే కమ్యూనికేషన్ ఛానల్ అని, అభ్యర్థులను ఓటీపీ షేర్ చేయాలని కోరబోమని ఎన్టీఏ పేర్కొన్నది. క్వశ్చన్ పేపర్లు కానీ, ఆన్సర్ పేపర్లను కానీ , ఎటువంటి లీకేజీ అంశాన్ని ఆ నెంబర్‌లో ఉండబోవని ఎన్టీఏ తెలిపింది.



# నిందితుల్ని వదిలిపెట్టం..

## అయోధ్య రామమందిరం విరాళాల స్కాంపై యూపీ సీఎం యోగి వార్నింగ్

ఉత్తర ప్రదేశ్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు వెల్లడైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. నిందితులు ఎలాంటివారైనా, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని సీఎం హెచ్చరించారు. యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రామ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజలు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన కోరారు.అలాగే, ఈ అంశంపై సిట్ దర్యాప్తు జరుపుతోందని, దీనికి సంబంధించి ఎవరివద్దనైనా ఆధారాలుంటే సిట్‌కు సమర్పించాలని ఆయన సూచించారు. ఆలయ ట్రస్ట్ వినతి మేరకు ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేశామని, ఈ అంశంలోని విషయాల్ని సిట్ వెలుగులోకి



తెస్తుందని భావిస్తున్నామని యోగి అన్నారు. భక్తులు కూడా ఆలయంపై జరుగుతున్న అనేక దుష్ప్రచారాలను నమ్మకుండా సహనంతో ఉండాలని, ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలకు దూరంగా ఉంటూ, రాముడికి సంబంధించి గౌరవం, సహనం కలిగి ఉండాలని భక్తులను కోరారు. రామాలయ ఉద్యమాన్ని కాంగ్రెస్, ఎస్పీలు అడ్డుకుంటున్నాయని, గత ప్రభుత్వాలు రామ భక్తులకు, కర సేవకులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారని యోగి గుర్తు చేశారు. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఇక్కడి ఆలయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తోందని, ఇది ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అన్నారు.రామాలయ ఉద్యమాన్ని కూడా కోర్టులో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందన్నారు. రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) గతంలో కరసేవకులపై కాల్పులు జరపాలంటూ ఆదేశించిందని, జై శ్రీరామ్ అన్నవారిపై దళాల్ని ప్రయోగించిందంటూ యోగి విమర్శించారు. అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే విషయం తాజాగా వెల్లడైంది. భక్తులు సమర్పించిన కానుకలు దేవాలయానికి చెందకుండా కొందరు సిబ్బంది కాజేశారని తేలింది. దీనిపై ప్రస్తుతం సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో కొన్ని ప్రాథమిక ఆధారాలు కూడా లభించాయి.

# నక్సల్ రహిత భారత్ లక్ష్య సాధనపై కేంద్ర హోం శాఖ కీలక ప్రకటన

ఢిల్లీ: నక్సల్ రహిత భారత్ లక్ష్య సాధనపై కేంద్ర హోం శాఖ ప్రకటన జారీ చేసింది. దేశ అంతర్గత భద్రతలో భాగంగా హోం శాఖ కీలక మైలురాయిని చేరిందని ప్రకటించింది. ఈ మేరకు నక్సలిజం అణచివేతపై నివేదికను విడుదల చేసింది. నక్సల్ రహిత భారత్ లక్ష్య సాధనలో అత్యంత వ్యూహాత్మక అడుగులు వేసినట్లు హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. 'ట్రేస్, టార్గెట్, న్యూట్రలైజ్' సిద్ధాంతంతో మావోయిస్టుల నెట్‌వర్క్‌ను భద్రతా దళాలు పూర్తిగా



నిర్వీర్యం చేశాయని పేర్కొంది.ఒకప్పుడు నక్సలైట్లకు కోటలుగా ఉన్న వారి సురక్షిత ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నట్లు హోం శాఖ వెల్లడించింది. నక్సలిజంపై పోరులో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చి అధునాతన లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌లను రంగంలోకి దింపినట్లు తెలిపింది. కాల్ లాగ్ విశ్లేషణ, మొబైల్ డేటా అనలిటిక్స్ ద్వారా మావోల కమ్యూనికేషన్ వ్యవస్థను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. సోషల్ మీడియాలో నిరంతర నిఘా ద్వారా వారి డిజిటల్ ప్రచారం, నిధుల సమీకరణ, నియామకాలకు గట్టి బ్రేక్ వేసినట్లు వెల్లడించింది. సాంకేతిక ఇన్‌పుట్‌ల ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న భద్రతా దళాల కార్యాచరణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచినట్లు వివరించింది.కాగా, 'ఆపరేషన్ కగార్' పేరుతో 2026 మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు దేశవ్యాప్తంగా వారి కదలికలపై నిఘా పెట్టింది. ఎన్‌కౌంటర్లలో కొంతమంది అగ్రనేతలను భద్రతా దళాలు మట్టుబెట్టగా.. మరికొంతమంది జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. మరోవైపు మావోయిస్టు కార్యకర్తలు, సానుభూతిపరులు కూడా భారీ సంఖ్యలో వివిధ రాష్ట్రాల పోలీసుల ఎదుట లొంగిపోయారు.

# కోవిడ్ వైరస్ లీకైన వుహాన్ ల్యాబ్‌కు.. ఫౌసీ నిధులు అందించారు: తులసీ గబ్బార్డ్

న్యూయార్క్: అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్‌సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్‌కు మెడికల్ అడ్వైజర్‌గా ఉన్న డాక్టర్ ఆంథోనీ ఫౌసీ.. చైనాలోని వుహాన్ వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌కు ఫండింగ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కోవిడ్19 వ్యాప్తికి కారణమైన ఆ ల్యాబ్‌పై సమాచారాన్ని దాచి పెట్టే విధంగా ఫౌసీ ప్రవర్తించినట్లు ఆమె తెలిపారు. వుహాన్ ల్యాబ్ గురించి అమెరికా కాంగ్రెస్‌ను కూడా ఫౌసీ తప్పుదోవ పట్టించారని తులసీ గబ్బార్డ్ పేర్కొన్నారు. నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ హోదా నుంచి వైదొలుగుతున్న తులసీ గబ్బార్డ్.. తన ఆఫీసు చివరి రోజున ఈ సంచలన విషయాలను వెల్లడించారు.కరోనా వైరస్ వ్యాప్తికి, చైనాలోని వుహాన్ వైరాలజీ ల్యాబ్‌కు కనెక్షన్ ఉన్నట్లు గతంలో అమెరికా ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే తన వద్ద ఉన్న క్లాసిఫైడ్ సమాచారాన్ని బయటపెడుతున్నట్లు తులసీ పేర్కొన్నారు. కోవిడ్ వివాదంలో ఫౌసీ పాత్రను బుట్టదాఖలు చేయాలన్న ఉద్దేశంతో ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు ఆమె చెప్పారు. తాను రిలీజ్ చేసిన సమాచారంలో గతంలో వెల్లడి కాని అనేక విషయాలు ఉన్నట్లు ఆమె చెప్పారు. వుహాన్‌లోని కరోనా వైరస్ రీసర్చ్ సంస్థకు ఫౌసీ నిధులు అందించినట్లు ఆమె ఆరోపించారు.కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో.. ఇంటెలిజెన్స్ అధికారులతో కలిసి ఫౌసీ వ్యవహరించిన తీరును ఆమె తన డాక్యుమెంట్‌తో డీక్లాసిఫై చేశారు. అమెరికా పన్నుదారులకు చెందిన నిధులను అక్రమ రీతిలో వుహాన్ రీసర్చ్ ల్యాబ్‌కు ఫౌసీ తరలించారని, ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకు ఇంటెలిజెన్స్ కమ్యూనిటీతో రాజకీయంగా వత్తిళ్లు తెచ్చినట్లు తులసీ గబ్బార్డ్ ఆరోపించారు. వుహాన్ ల్యాబ్‌లో కరోనా వైరస్ గురించి ఫౌసీకి తెలుసు అని, కానీ ఆయన అమెరికా ప్రజలను, ఉభయసభలను తప్పుదోవ పట్టించారని ఆమె ఆరోపించారు.గతంలో అమెరికా అంటువ్యాధుల సంస్థ(ఎన్ఐఏఐడీ)కి అధిపతిగా ఫౌసీ బాధ్యతలు నిర్వర్తించారు. వుహాన్ వైరాలజీ ల్యాబ్‌లో గబ్బిలాలకు చెందిన కరోనా వైరస్‌పై పరిశోధన జరుగుతున్న అంశం గురించి తెలుసుకునేందుకే.. ఫౌసీ ప్రజల నిధులను దుర్వినియోగం చేసినట్లు గబ్బార్డ్ తన ప్రకటనలో ఆరోపించారు. కరోనా సమయంలో అధ్యక్షుడు ట్రంప్, ఫౌసీ మధ్య కూడా విభేధాలు తలెత్తిన విషయం తెలిసిందే.



# మల్కాజ్‌గిరి రౌడీలకు భయపడొద్దు.. కార్యకర్తలకు అండగా ఉంటాం : కేటీఆర్



హైదరాబాద్ : మల్కాజ్‌గిరి లో రౌడీయిజానికి ( పాల్పడుతున్న నాయకుడికి బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. శుక్రవారం మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్కాజ్‌గిరిలో ఒకడు నేను గూండాను, రౌడీని అంటున్నాడు. నిన్ను కొట్టే రౌడీలు, గూండాలు మా దగ్గర కూడా చాలా మంది ఉన్నారని స్పష్టం చేశారు.ఏ రౌడీ వచ్చినా భయపడ వద్దని అవసరమైతే తానే అక్కడికి వస్తానని భరోసా ఇచ్చారు. పొరపాటున నాయకులు, కార్యకర్తలపై ఏ చిన్న కేసు పెట్టినా విడిపించుకుంటామని కార్యకర్తల్లో జోష్ నింపారు. అడ్డగోలు మాటలు చెప్పి నోటికొచ్చిన హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, 100 రోజుల్లోనే 420 గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి 900 రోజులు అయింది. హామీల అమలు ఇంకెప్పుడు చేస్తారని నిలదీశారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి : మర్రి మహేష్




హనుమకొండ చౌరస్తా, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ గర్ల్స్? హై స్కూల్, ప్రాక్టీస్ హై స్కూల్లో సర్వే నిర్వహించారు.ఈ స్కూళ్లలో కొన్ని స్కూళ్లలో చదువు చెప్పడానికి టీచర్స్? కోరుతూ ఉందని మర్కజీ హైస్కూల్లో హిందీ బోధించడానికి టీచర్స్?కొరత ఉందని గేమ్స్? ఆడిపించడానికి స్కూల్ మొత్తంలో ఒక్కరే పీఈటీ ఉన్నారని మరొకరి అవసరం ఉందని అలాగే టాయిలెట్ సరిపోను లేవని ప్రాక్టీసింగ్ హైస్కూల్లో పర్మినెంట్ టీచర్స్ లేరని డిప్యూటేషన్ మీద వచ్చిన వారే ఉన్నారన్నారు.బాయ్స్?కి మొత్తానికి టాయిలెట్స్? లేవని ఉన్న స్కూళ్లలో క్లీన్ చేయడానికి స్కావెంజర్స్? లేరని గర్ల్స్? హైస్కూల్లో వాన పడినప్పుడు గ్రౌండ్‌లో నీళ్ళు ఆగుతున్నాయని క్లాస్రూంలోకి నడవడానికి కూడా ఇబ్బంది అవుతుందని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ స్కూల్ సమీపంలోనే ప్రైవేట్ పాఠశాలలు నెలకొన్నాయని వెంటనే డీఈఓ, కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ కార్యవర్గ సభ్యులు వంగవీటి మోహన్, జిల్లా నాయకులు రమణ, విశ్వతేజ్ పాల్గొన్నారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ సర్కార్ భూదందా : ఎమ్మెల్యే వివేకానంద

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని అసెంబ్లీ విప్ కేపీ వివేకానంద ఆరోపించారు. తెలంగాణ భవన్ లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం 12 వేల కోట్ల విలువైన భూములు అమ్మి వాటితో ఏం చేశారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.రాయదుర్గం వద్ద ఉన్న భూమికి హైకోర్టులో ఉత్తర్వులు ఉన్నా ఈవేలం ద్వారా వేరే కంపెనీకి విక్రయించారని, ప్రభుత్వం దిగజారుడికి నిదర్శనమని విమర్శించారు. .హిల్ట్ పాలసీ ద్వారా భూములను తన బినామీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని, మూసీ ప్రక్షాళన పేరుతో భూదందా చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండాకేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.కేసీఆర్ నామస్మరణ లేనిది రేవంత్ రెడ్డికి నిద్ర పట్టడం లేదని పేర్కొన్నారు.హైదరాబాద్ ను విస్మరించి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ కడుతున్నారని ఆరోపించారు. దమ్ముంటేసిద్దిపేటలో హరీష్ రావుపై పోటీ చేసి గెలవాలని రేవంత్ రెడ్డి కి సవాల్ విసిరారు.కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం లేదని అన్నారు.



# నంద్యాలలో తమ్ముళ్లు తగువలాట

కర్నూలు, జూన్ 19 నంద్యాల జిల్లాలోని సగానికిపైగా నియోజకవర్గాల్లో టీడీపీ నేతల మధ్య నిత్యం వివాదాలు నడుస్తున్నాయి. నియోజకవర్గ వ్యవహారాలైనా, అధికారిక కార్యక్రమాలైనా, పార్టీ ప్రోగ్రామ్స్ అయినా సరే? రచ్చ జరక్కపోతే? ఆ కార్యక్రమం నిర్వహించిన ఫీల్ ఉండటం లేదని సొంత పార్టీలోనే సెటైర్స్ పడుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. తాజాగా జరిగిన నంద్యాల జిల్లా స్థాయి పార్టీ సమావేశాన్నే ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు. ఆ సందర్భంగా వినిపించిన కోవర్ట్ వ్యాఖ్యలు వివాదానికి దారి తీశాయి. జిల్లా ఇన్చార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరైన ఈ సమావేశానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అటెండ్ అవలేదు. పైగా పార్టీలో కోవర్టులు ఉన్నారని ఆమె అనడం కలకలం రేపింది. జిల్లాకు చెందిన మంత్రులు ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి వంటి నేతలంతా కార్యక్రమంలో పాల్గొన్నారు. కానీ? సమావేశానికి గైర్హాజరైన భూమా అఖిల బయట మీడియాతో చేసిన వ్యాఖ్యలు రచ్చకు దారితీశాయి. ఆ సమావేశంలో పాల్గొనకపోవడం సంతోషంగా ఉందని అన్నారామె. పార్టీ కోసం నిజాయితీగా పనిచేసే కార్యకర్తలను పక్కనబెట్టి, కోవర్టులను ముందుకు తీసుకువచ్చి మాట్లాడించడం కార్యకర్తలకు ఆమోదయోగ్యం కాదని అన్న మాటలు ఎవర్ని ఉద్దేశించి అన్న చర్చలు నడుస్తున్నాయి. ఈ పరిస్థితిని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని కూడా హెచ్చరించారు అఖిలప్రియ. పార్టీలో ఒకవైపు కష్టపడే నాయకులు, కార్యకర్తలు ఉంటే మరోవైపు కోవర్టులు ఉన్నారని అన్నారు మాజీ మంత్రి. పార్టీ కోసం పని చేయని వ్యక్తులు స్టేజీలపైకి ఎక్కి మైకులు పట్టుకుని మాట్లాడటం సరికాదన్నారామె. పని చేసే వాళ్లు, చేయని వాళ్లు ఒకే వేదిక మీదికి వస్తే విలువ ఏముంటుందన్నది అఖిల క్వశ్చన్. రాయలసీమలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రూప్ రాజకీయాలు ఉన్నాయని, ఈ పరిస్థితిని సరిదిద్దాలని అధిష్టానానికి సూచించారు. పార్టీ అధినాయకత్వం కోవర్టులను గుర్తించి తప్పక చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం ఉందంటూ ముక్తాయింపునిచ్చారు. దీంతో? మాజీ మంత్రి ఎవర్ని ఉద్దేశించి అంత తీవ్ర వ్యాఖ్యలు చేశారు? ఆమె టార్గెట్ ఎవరంటూ రకరకాల చర్చలు నడుస్తున్నాయి. వేదిక మీద మాజీ మంత్రితో విభేదించే నాయకులు పలువురు ఉండటంతో?వారిలో ఎవర్ని ఉద్దేశించి కోవర్ట్ వ్యాఖ్యలు చేశారన్నది ఆసక్తి కరంగా మారింది. ఆ విషయంలో ఎవరి విశ్లేషణలు వారికి ఉన్నా? ఎక్కువ మంది మాత్రం ఏవీ సుబ్బారెడ్డిని ఉద్దేశించే అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారట. అఖిలకు , ఏవీకి మధ్య విబేధాలు, వివాదాలు, కొట్లాటలు, కేసుల గురించి అందరికీ తెలిసిందే. ఆయన పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ ఏ ప్రోటోకాల్ ప్రకారం ఆయన్ని వేదికపై మొదటి వరుసలో కూర్చోబెట్టారంటూ టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితను ప్రశ్నించినట్టు తెలిసింది. పార్టీ పంపిన జాబితాలో ఆయన పేరు వుందని, అందుకే కార్యక్రమానికి, వేదికపైకి పిలిచామని చెప్పారట చరిత. అటు ఇన్చార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా సమావేశంలో మాట్లాడుతూ పార్టీ గ్రూపు రాజకీయాలను ప్రస్తావించారు. అందరిని కలుపుకొని వెళ్లాలని, గ్రూపు రాజకీయాలు పెట్టుకుంటే పార్టీతో పాటు వ్యక్తిగతంగా మీరు కూడా నష్టపోతారని అన్నట్టు తెలిసింది. ఆ సంగతి ఎలాఉన్నా? అఖిల ప్రియ కోవర్ట్ వ్యాఖ్యల చుట్టూనే ఎక్కువ డిస్కషన్ నడుస్తోంది. ఏవీ సుబ్బారెడ్డి అంతలా ఏం చేశారంటూ క్వశ్చన్ మార్క్ ఫేస్‌లు పెడుతున్నారట చాలామంది నేతలు. కొద్ది రోజుల క్రితమే మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి మంత్రి ఫరూక్‌పై ఆటో నగర్ విషయంలో సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఇపుడు భూమా అఖిల ఏవీ సుబ్బారెడ్డిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానంటున్నారు. ఈ రకంగా మొత్తమ్మీద నంద్యాల టీడీపీలో వరుస వివాదాలు పెరుగుతుండగా?.. అధిష్టానం ఎలా డీల్ చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు చూపు

తిరుపతి జూన్ 19, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి ఖరీఫ్ సీజన్‌పై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఐఎండీ హెచ్చరించింది. రైతులు పంటల సాగు విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఎల్‌నినో కారణంగా ప్రత్యేక వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో పంటల సాగు విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పంటల మార్పిడికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా రంగాలపై సమీక్ష నిర్వహించారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై రైతులకు సూచనలు ఇవ్వాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని రైతులు పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ఎల్‌నినో ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కీలక సూచనలు చేశారు. జిల్లాలవారీగా నేల స్వభావం, వర్షపాతం అంచనాలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యేక పంటల ప్రణాళిక రూపొందించారు. రాయలసీమ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉందంటున్నారు. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, సజ్జలు, కొర్రలు, రాగుల్లాంటి పంటలు పండించాలని సూచిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రత్యేకంగా వేరుశెనగ, కంది, ఆముదం లాంటి అంతరపంటల విధానాన్ని పాటిస్తే నష్టాలు తగ్గించుకోవచ్చని సలహాలు ఇస్తున్నారు. కోస్తాలోని తూర్పుగోదావరి, కాకినాడ,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ప్రధాన పంటగా వరిని సాగు చేస్తారు. నీళ్లు అందుబాటులో ఉంటేదాన్ని బట్టి స్వర్ణ, ఎంటీయూ 1224, ఎంటీయూ 1318, బీపీటీ 5204 రకాలు సాగుచేయాలని సూచిస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరి, కంది, పెసర, మినుము, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేయాలని.. పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో కంది, పత్తి, వేరుశనగ పంటలు.. నెల్లూరు జిల్లాలో కంది, మినుము, అలసంద, పెసర, కొర్రలు, మేతజొన్న సాగు చేయాలంటున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల విషయానికి వస్తే.. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లో వరితో పాటుగా చిరుదాన్యాలైన మొక్కజొన్న, రాగులు, సామలు, కొర్రలు సాగు చేయాలంటున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో నేరుగా విత్తే వరితో పాటుగా పెసర, మినుము, నువ్వులు, రాగులు, సజ్జలు, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ లాంటి పంటలు సాగుచేయాలి. శాస్త్రవేత్తలు చేసిన సూచనల్ని స్థానికంగా ఉండే పరిస్థితుల్ని బట్టి పాటించాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వం చేసే సూచనల్ని కూడా పాటించాలి.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ జిల్లా స్థాయి సభ

### పాల్గొన్న కడప డిసిసి బ్యాంక్ ఛైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి.

బద్వేలు .కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కడపలో నిర్వహించిన జిల్లా స్థాయి విజయోత్సవ సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మ , జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలు, వివిధ రంగాలలో సాధించిన పురోగతిపై విస్తృతంగా చర్చించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని తెలిపారు. అలాగే, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రజల సహకారంతో మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు.

# మిత్రపక్షాల మధ్య లొల్లి

అనంతపురం, జూన్ 19 శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో అధికార కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య పొలిటికల్ వార్ ఇప్పుడు తారస్థాయికి చేరింది. కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరు అభివృద్ధి పనులతో పాటు వివిధ ప్రభుత్వ పనుల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి గళమెత్తడం స్థానికంగా తీవ్ర దుమారం రేపింది. అయితే, ఈ ఆరోపణలపై అధికారికంగా విచారణ జరిపించాల్సిన యంత్రాంగం కంటే.. స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలే ఎక్కువగా రియాక్ట్ అవుతూ కౌంటర్లకు దిగడం ఇక్కడ విచిత్రమైన వాతావరణాన్ని సృష్టిస్తోంది. నిజానికి, విష్ణువర్ధన్ రెడ్డి తన ప్రకటనల్లో ఎక్కడా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేరు గానీ, లేదా నిర్దిష్టంగా టీడీపీ నేతల పేర్లు గానీ ప్రస్తావించలేదు. కేవలం పనుల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాత్రమే డిమాండ్ చేశారు. కానీ, ఎమ్మెల్యే అనుచరులు, టీడీపీ వర్గాలు ఈ ఆరోపణలు తమకే వర్తిస్తాయన్నట్లుగా ఫీలయ్యారు. అంతటితో ఆగకుండా, విష్ణువర్ధన్ రెడ్డి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారంటూ ఏకంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. పనులు సవ్యంగా జరిగితే విచారణకు వెనుకాడాల్సిన అవసరం లేదని, కానీ ఇలా పోలీసులను ఆశ్రయించడం చూస్తుంటే ఏదో దాస్తున్నారనే అనుమానాలు పెరుగుతన్నాయంటున్నారు. కదిరి కూటమి రాజకీయాల్లో మరో విచిత్రమైన ట్రెండ్ నడుస్తోంది. స్థానికంగా ప్రజా సమస్యలపై, ఇతర అక్రమాలపై బీజేపీ నేతలు గొంతెత్తితే చాలు.. వారిపై వెంటనే వైసీపీ కోవర్ట్ అనే ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ నేతలంటున్నారు. నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే ఉన్నంత మాత్రాన, మిత్రపక్షంగా ఉన్న బీజేపీ అసలు ఏ కార్యక్రమాలు చేయకూడదా? ప్రజా పక్షాన నిలబడకూడదా? అని బీజేపీ క్యాడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కలిసి పోరాడి, ఇప్పుడు అధికారంలోకి రాగానే తమ ఉనికిని పూర్తిగా దెబ్బతీయాలని చూడటం ఏ రకమైన కూటమి ధర్మమని కమలదళం ప్రశ్నిస్తోంది. ఇటీవల జరిగిన కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు, రథోత్సవం వేళ కూడా ఈ ఇద్దరు నేతల మధ్య ఆధిపత్య పోరు రచ్చకెక్కింది. ఏటా సాంప్రదాయబద్ధంగా రథోత్సవంలో పాల్గొనే విష్ణువర్ధన్ రెడ్డిని కట్టడి చేసేందుకు ఎమ్మెల్యే కందికుంట పోలీసుల ద్వారా హౌస్ అరెస్ట్ చేయించారనే ఆరోపణలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే కదిరి వేదికగా టీడీపీ కార్యకర్తలకు.. కమలనాథులకు మధ్య ఇంత పెద్ద గ్యాప్ రావడం రాష్ట్ర కూటమి నేతలను కలవరపరుస్తోంది. వార్ ఇలాగే కొనసాగితే, అది కేవలం కదిరికే పరిమితం కాకుండా రాయలసీమ వ్యాప్తంగా కూటమి ఐక్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కదిరి రాజకీయం ముందు ముందు ఏ మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

## కడపలో కళకళలాడుతున్న స్టేడియం

కడప, జూన్ 19, (న్యూస్ పల్స్)కడప క్రికెట్ స్టేడియానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాత్రి సమయంలో తీసిన కడప స్టేడియం ఏరియల్ వ్యూ వీడియో కూడా ఆకట్టుకుంటోంది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం దక్కడంతో.. కడప స్టేడియం గురించి అందరికీ తెలిసింది. ఇది దేశంలోనే అత్యంత అందమైన క్రికెట్ స్టేడియాల్లో ఒకటి అని చెబుతున్నారు. ఇంకా డెవలప్ చేసి, ఎక్కువ మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా మ్యాచ్ వీక్షించడానికి వీలుగా స్టేడియం కెపాసిటీని పెంచితే.. ఇక్కడ టెస్టులు, వన్డేలు నిర్వహించొచ్చని సూచిస్తున్నారు.'ఎప్పుడు ఈ రూట్లోనే వెళ్తుంటా.. కానీ ఈ స్టేడియం ఇంత బాగుంటుందని నాకు తెలీదు. ఏరియల్ వ్యూ చాలా బాగుంది' అని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఈ స్టేడియం పక్కనే రైల్వే ట్రాక్ ఉంటుందని.. రైల్లో వెళ్తున్నప్పుడు ఈ ప్రదేశాన్ని చూడటం భలే ఉంటుందని మరో నెటిజన్ తన అనుభవాన్ని చెప్పుకొచ్చారు. అంతా బాగానే ఉంది కానీ.. వేసవిలో ఏపీలో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో కడప ఒకటి. ఎండా కాలం ఇక్కడ 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయి,

# కాకినాడ పామాయిల్ తోటలో మిస్టరీ!

## రెండేళ్ల జ్ఞానేశ్వరి ఏమైంది? ఆ 35 నిమిషాల్లో ఏం జరిగింది?

కాకినాడ, జూన్ 19 నిశ్శబ్దంగా ఉన్న ఆ పామాయిల్ తోటలు ఇప్పుడు ఒక తీరని వేదనను, అంతుచిక్కని మిస్టరీకి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కన్నవారి కళ్ల ముందే ఆడుకుంటూ కనిపించకుండా పోయిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి ఉదంతం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. కేవలం 35 నిమిషాల గ్యాప్‌లో ఆ పసిపాప ఎటు వెళ్లింది. ప్రాణ స్నేహితుడిలా వెంట వెళ్లిన పెంపుడు కుక్క మౌనంగా తిరిగి వచ్చి ప్రాణాలు ఎందుకు వదిలింది? అనే ప్రశ్నలకు సమాధానాలు చిక్కడం లేదు. కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్. అగ్రహారంలో జూన్ 6న మొదలైన ఈ అన్వేషణ... నేటికి ఓ కొలిక్కి రావడం లేదు. డ్రోన్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, వందలాది





మంది పోలీసులు రంగంలోకి దిగినా ఫలితం శూన్యం. ఈ క్రమంలో పోలీసులు చేస్తున్న ఒక వింత ప్రయోగం ఇప్పుడు అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పాపను అడవి జంతువులు ఏమైనా తీసుకెళ్లాయా అనే కోణంలో మాంసం నింపిన బొమ్మలతో ఆపరేషన్ మొదలు పెట్టారు. జూన్ 6వ తేదీన తల్లిదండ్రులు గణేష్, భవానితో కలిసి పామాయిల్ తోటకు వెళ్లింది చిన్నారి జ్ఞానేశ్వరి. తల్లిదండ్రుల మధ్య జరిగిన సమన్వయలోపం కారణంగా ఆ పసిపాప ఒంటరిగా మిగిలిపోయింది. పోలీసులు నిర్ధారించిన దాని ప్రకారం సరిగ్గా 35 నిమిషాల వ్యవధిలో బాలిక మాయమైంది. సమాచారం అందిన వెంటనే యంత్రాంగం అలెర్ట్ అయినప్పటికీ, ఆ దట్టమైన తోటల్లో పాప ఆచూకీ దొరకలేదు. ఈ కేసులో అత్యంత విషాదకరమైన, మిస్టరీగా మారిన అంశం వారి పెంపుడు కుక్క. పాపా వెంట వెళ్లిన ఈ కుక్క జూన్ 9న ఒంటరిగానే ఇంటికి చేరింది. ఇంటికి వచ్చినప్పటి నుంచి ఆహారం తీసుకోకుండా వింతగా ప్రవర్తించింది. దీనికి జీపీఎస్ ట్రాకర్ అమర్చి పాపా ఎక్కడ ఉందో కనుగొనే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. సుమారు 80 కిలోమీటర్లు ఆ తోటల చుట్టూ తిరిగి ఆ కుక్క, చివరకు జూన్ 13న మరణించింది. వైరల్ ఇన్ఫెక్షన్ లేదా నాలుగు రోజులు ఆహారం లేకపోవడం వల్ల అది చనిపోయి ఉంటుందని భావించారు. పాపను అడవి జంతువులు ఏమైనా ఎత్తుకెళ్లాయా అన్న అనుమానంతో అధికారులు ఒక షాకింగ్ ఆపరేషన్ చేపట్టారు. తోటలో ఒక ఇనుప బోను ఏర్పాటు చేసి అందులో చిన్నారిని పోలిన రెండు బొమ్మలను ఉంచారు. ఆ బొమ్మల లోపల మాంసం ముక్కలను నింపి, జంతువులను ఆకర్షించేలా ప్లాన్ చేశారు. దీనికి తోడు చుట్టూ కెమెరా ట్రాప్లను పెట్టారు. వన్యమృగాల కదలికలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతోపాటు అధునాతన డ్రోన్లతో తోటలను జల్లెడ పడుతున్నారు. అడవితోపాటు సమీపంలోని సంచార జాతుల పైన కూడా పోలీసులు నిఘా పెట్టారు. డీఎస్పీ తిలక్ స్వయంగా ఈ ఆపరేషన్ పర్యవేక్షిస్తున్నారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి జిల్లా యంత్రాంగం లక్ష రూపాయల రివార్డు ప్రకటించింది. ఇదే సమయంలో సోషల్ మీడియాలో వస్తున్న నెగెటివ్ వార్తలపై పోలీసులు సీరియస్ అయ్యారు. అవాస్తవాలు ప్రచారం చేస్తే లీగల్‌గా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాపు నేతల్లో కాక...

రాజమండ్రి, జూన్ 19 రాజకీయాల్లో కొంతమంది పనితీరుతో రాణిస్తారు. మరికొందరు సెంటిమెంట్ రాజకీయాలు నడిపి రాణిస్తారు. రెండో కోణంలో రాణించారు జగన్మోహన్ రెడ్డి. వైయస్ రాజశేఖర్ రెడ్డి పై ఉన్న ప్రజాభిమానాన్ని తాను పొందగలిగారు. తండ్రి మాదిరిగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల మనసు గెలవాలని చూసారు. కానీ ప్రజలు మాత్రం జగన్మోహన్ రెడ్డిలో రాజశేఖర్ రెడ్డిని చూసుకోలేదు. మహానేత కుమారుడిగా ఒక్కసారి మాత్రమే ఛాన్స్ ఇచ్చారు. రెండోసారి మాత్రం చాన్స్ ఇవ్వలేదు. అయితే రాజశేఖర్ రెడ్డి చేయలేనంతగా.. కులాలను, వర్గాలను విడదీసి వారి అభిమానాన్ని పొందాలనుకున్నారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఒక్కసారి మాత్రమే అందులో కూడా సక్సెస్ అయ్యారు. రెండోసారి విఫలమయ్యారు. ఏపీలో ఎవరు అధికారంలోకి రావాలన్నా ప్రధాన సామాజిక వర్గంగా ఉన్న కాపులు మద్దతు ఉండాల్సిందే. అయితే ఆ కాపులను 2019 ఎన్నికల్లో టర్న్ చేసుకోవడంలో సక్సెస్ అయ్యారు జగన్మోహన్ రెడ్డి. కాపు రిజర్వేషన్ ఉద్యమం ద్వారా భారీగా లబ్ధి పొందారు. ఇప్పుడు కూడా అటువంటి వ్యూహాలకు పదును పెడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయానికి కాపులే కారణమని జగన్మోహన్ రెడ్డి గుర్తించారు. అందుకే వారిలో చీలిక తేవాలని చూస్తున్నారు. కాపుల వేళ్ళతో కాపులను పొడిచే సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. కాపు ఓటు బ్యాంకు ను చీల్చడమే కూటమిని దెబ్బతీసే ఏకైక మార్గం అని బలంగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కాపులు ఆదరించని వైసీపీ కాపు నేతలు చాలామంది ఉన్నారు. వారిని ముందు పెట్టి ఇప్పుడు రాజకీయ క్రీడ మొదలుపెట్టారు. ఒక అంబటి రాంబాబు, పేర్ని నాని, తోట త్రిమూర్తులు, గుడివాడ అమర్నాథ్, కన్నబాబు, బొత్స సత్యనారాయణ.. ఇలాంటి వైసీపీ కాపు నేతలను ముందు పెట్టి కాపుల విషయంలో బలమైన ప్రచారానికి జగన్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. పవన్ కళ్యాణ్ రూపంలో కూటమిలో డిప్యూటీ సీఎం పదవి ఉన్న కాపులకు ఎటువంటి ప్రయోజనం లేదని ప్రచారం మొదలుపెట్టారు. కాపు సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని కోణంలో వ్యతిరేకతను నూరి పోయాలని చూస్తున్నారు. పవన్ కళ్యాణ్ పై కాపు యువతలో, ఓటర్లలో అసంతృప్తిని పెంచగలిగితే.. ఆ ఓట్లు ఆటోమేటిక్గా తమ వైపు టర్న్ అవుతాయన్నది జగన్ ఆలోచన.

# వైసీపీ ట్రాప్ లో చింతమనేని

ఏలూరు, జూన్ 19 (వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులను రెచ్చగొట్టి మాట్లాడించడం ఒక అలవాటైన విద్య. ఒక విషయాన్ని వివాదాస్పదం చేయడం కూడా ఆ పార్టీకి తెలిసినంతగా మరో పార్టీకి తెలియదు. ఇప్పుడు దెందులూరు నియోజకవర్గం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విషయంలో అలానే చేసింది ఆ పార్టీ. ఆయనను రెచ్చగొట్టి.. రహదారిపైకి వచ్చేలా చేసి.. దానిపై వ్యతిరేక ప్రచారం చేయించి.. రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. అందులో కొంత వరకు సక్సెస్ అయ్యింది కూడా. చింతమనేని ప్రభాకర్ కు వ్యతిరేకంగా లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు తో వైసిపి ఆడిన హైడ్రామా.. నిజంగా పక్కా పొలిటికల్ స్క్రీన్ తో చేసినదే. ప్రెస్మీట్లో లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు చింతమనేని ప్రభాకర్ రావు కుటుంబ సభ్యులకు విమర్శలు చేశారు. నా వెంట్రుక కూడా పీకలేరు అంటూ.. చింతమనేని లో ఉన్న ఆగ్రహాన్ని బయటకు తీసేలా చేసి రెచ్చగొట్టారు. అనుకున్నది సాధించగలిగారు.దెందులూరు లో గెలిచారు చింతమనేని ప్రభాకర్ రావు వైసీపీ నేత కొఠారు అబ్బయ్య చౌదరిపై. సహజంగానే మాస్ ఇమేజ్ ఉంది చింతమనేని ప్రభాకర్ కు. దానిని దెబ్బతీసేందుకు టిడిపి ముసుగు వేసుకొని ఉన్న లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావును ఆశ్రయించారు. చింతమనేని ప్రభాకర్ ను ఆయనతో తిట్టించారు. చింతమనేని అనుచరులపై లేనిపోని ఆరోపణలు చేశారు. అంతటితో ఆగకుండా చింతమనేని కుటుంబ సభ్యులు, కుమార్తెలపై కూడా పరోక్ష వ్యాఖ్యలు చేసి ప్రభాకర్ లో ఉన్న ఆగ్రహాన్ని తట్టి లేపారు. ఈ మొత్తం ఒక పొలిటికల్ అజెండాగా సాగించారు అబ్బయ్య చౌదరి. లాయర్ ఈడుపుగంటి శ్రీనివాసరావు అబ్బయ్య చౌదరితో కలిపి చేసిన రాజకీయాన్ని టిడిపి హై కమాండ్ సైతం గుర్తించింది. అందుకే ఆయనను పార్టీ నుంచి బహిష్కరించింది.మొన్నటి ఎన్నికల్లో దెందులూరు నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు చింతమనేని ప్రభాకర్. ఓడిపోయిన అబ్బయ్య చౌదరి ఎలాగైనా నియోజకవర్గంలో నిలదొక్కుకోవాలని చూశారు. కూటమి ప్రభుత్వంతో పాటు చింతమనేని డిఫెన్స్ లో పడేయాలని ఒక లోతైన వ్యూహాన్ని రచించారు. చింతమనేని దెబ్బ కొట్టేందుకు ఆయనకు అత్యంత అప్తుడిగా ఉంటూ? లోగుట్లు తెలుసుకున్న ఈడుపుగంటి శ్రీనివాసరావు వాటిని అస్త్రంగా మలుచుకున్నారు. చింతమనేని ఆర్థిక మూలాలను, కుటుంబ ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రెస్ మీట్ లు పెట్టడానికి వైసీపీ బ్యాక్ అండ్ సపోర్ట్ తీసుకున్నారు. అలా ఆడిన వ్యవహారంలో చింతమనేని చిక్కుకున్నారు. చింతమనేనిని మానసికంగా దెబ్బతీసేందుకు ఆయన కుటుంబ సభ్యులను సైతం వివాదాల్లోకి లాగారు. అబ్బయ్య చౌదరి తవ్విన గొయ్యిలో చింతమనేని ప్రభాకర్ ఆవేశంతో పడిపోయారు. దీనిని శాంతిభద్రతల సమస్యగా చూపి వైసిపి ప్రచారాస్త్రంగా మార్చుకుంటుంది. కానీ వైసీపీతో చేతులు కలిపిన ఈడుపుగంటి శ్రీనివాసరావును టిడిపి హై కమాండ్ సస్పెండ్ చేసి కొంత దిద్దుబాటు చర్యలకు దిగింది.



# ఖాళీ కడుపుతో ఈ జ్యూస్ తాగితే చాలు.. మీ ఇమ్యూనిటీ రెట్టింపు పక్కా..!



ఖాళీ కడుపుతో ఉసిరి జ్యూస్ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఉసిరిలో అనేక ఆరోగ్యకరమైన గుణాలు ఉన్నాయి. దీనిలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ , ఇతర ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఉసిరి జ్యూస్‌ను ఖాళీ కడుపుతో తీసుకోవడం ద్వారా అవి శరీరానికి సమర్థంగా అందుతాయి. క్రింద ఉసిరి జ్యూస్ తాగి కలిగే ముఖ్య ప్రయోజనాలను చూద్దాం: రోగనిరోధక శక్తిని పెంచుతుంది: ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉండటం వల్ల, ఇది రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది , ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. రోజూ ఉదయం తాగడం వల్ల వ్యాధులపై శరీరం సమర్థంగా పోరాడగలదు. "తాటి తేగల గురించి ఈ విషయాలు తెలిస్తే తప్పక తింటారు!" జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: ఉసిరిలో ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల మలబద్ధకాన్ని నివారిస్తుంది. గ్యాస్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల జీవక్రియను ప్రేరేపిస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది: ఉసిరి జ్యూస్ మేటబాలిజంను మెరుగుపరుస్తుంది. శరీరంలోని కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది , ఆకలిని నియంత్రిస్తుంది, దీని ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. చర్మం , జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: ఉసిరిలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటంతో, చర్మ కాంతివంతంగా మారుతుంది. ఇది ముడతలు, మొటిమలు వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి సహాయపడతాయి. జనీబీ "ఀఃఅ జ్యూస్ తీసుకోండి... ఆగకుండా పరిగెత్తుతారు!" రక్త శుద్ధి: ఉసిరి జ్యూస్ రక్తాన్ని శుద్ధి చేస్తుంది. ఇది హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచి, ఆరోగ్యకరమైన రక్త ప్రసరణను ప్రోత్సహిస్తుంది. అంతే కాకుండా ఉసిరి జ్యూస్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది ముఖ్యంగా మధుమేహ రోగులకు చాలా ప్రయోజనకరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది: ఉసిరి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఉసిరి జ్యూస్ వ్యాధి నిరోధక గుణాలు కలిగి ఉండటం వల్ల, నొప్పులు తగ్గుతాయి మరియు శరీరానికి శక్తి వస్తుంది. ఎలా తీసుకోవాలి: ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు ఉసిరి జ్యూస్ తాగవచ్చు. తాజా ఉసిరికాయలను ఉపయోగించి జ్యూస్ తయారు చేసుకోవచ్చు లేదా మార్కెట్లో లభించే ఉసిరి జ్యూస్‌ను కూడా ఉపయోగించవచ్చు. రుచి కోసం కొద్దిగా తేనె లేదా అల్లం జోడించవచ్చు. ఖాళీ కడుపుతో తాగేటప్పుడు మోతాదును ఎక్కువ చేయకుండా జాగ్రత్తపడాలి. కొన్ని సందర్భాల్లో ఒంటికి తగలకపోతే వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది

# లొట్టలేసుకుంటూ పీనట్ బటర్ తింటున్నారా?

పీనట్ బటర్ అనేది ఆరోగ్యకరమైన , పోషకవంతమైన ఆహార పదార్థంగా గుర్తించబడింది. దీనిని చాలా మంది తమ రోజువారి ఆహారంలో చేర్చుకుని ఆస్వాధిస్తారు. ఇది రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచిదని చెబుతారు. అయితే, దీని ప్రయోజనాలు, ఉపయోగాలు, పరిమితులను బట్టి ఇది ఆరోగ్యానికి ఎంతమాత్రం మంచిదో నిర్ణయించవచ్చు. ఇది ప్రోటీన్, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలతో నిండిన ఆహార పదార్థం. కానీ నిజంగా పీనట్ బటర్ ఆరోగ్యానికి ఎంతవరకు మంచిది, దానిలో ఏం ఉంటుంది, దీని గురించి మనం తెలుసుకుందాం.. పీనట్ బటర్‌లో ఏముంటుంది? పీనట్ బటర్‌లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. ప్రోటీన్ మన శరీరానికి ఎంతో అవసరం. ఇది కండరాల నిర్మాణానికి, శరీరాన్ని చురుగ్గా ఉంచడానికి సహాయపడుతుంది. పీనట్ బటర్‌లో మన శరీరానికి అవసరమైన మోనోసాచురేటెడ్ , పాలీఅన్‌సాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఈ కొవ్వులు గుండె ఆరోగ్యానికి మంచివి. పీనట్ బటర్‌లో విటమిన్ ఇ, విటమిన్ ః3, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీనిలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది , మలబద్ధకం నివారిస్తుంది. అంతే కాకుండా పీనట్ బటర్‌లో కేలరీలు అధికంగా ఉంటాయి. కాబట్టి దీన్ని మితంగా తీసుకోవడం మంచిది. "ప్రతి రోజూ ఉడకబెట్టిన గుడ్లు తింటున్నారా?" పీనట్ బటర్ ఆరోగ్యానికి ఎలా మంచిది? పీనట్ బటర్‌లో ఉండే మంచి కొవ్వులు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇది గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. దీనిలో ఉండే కాల్షియం మరియు విటమిన్ ఆ ఎముకలను బలపరుస్తాయి. పీనట్ బటర్‌లో ఉండే కార్బోహైడ్రేట్లు మరియు ప్రోటీన్ శరీరానికి శక్తిని అందిస్తాయి. దీనిలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం మంచి మూడ్‌కు దోహదపడుతుంది. పీనట్ బటర్ తీసుకునేటప్పుడు జాగ్రత్తలు కొంతమందికి పీనట్స్‌కు అలర్జీ ఉంటుంది. వారు పీనట్ బటర్‌ను తీసుకోకూడదు. ఈ బటర్‌లో కేలరీలు అధికంగా ఉండటం వల్ల దీన్ని అధికంగా తీసుకుంటే బరువు పెరగవచ్చు. కొన్ని రకాల పీనట్ బటర్‌లో చక్కెర అధికంగా ఉంటుంది. షుగర్ ఉన్న వారు దీన్ని తీసుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి. సీపీ జరిమానా.! రచ్చ చేస్తే చర్యలు తప్పవని వార్నింగ్.! పీనట్ బటర్ ఆరోగ్యానికి మంచిదే కానీ, దీన్ని మితంగా తీసుకోవడం చాలా ముఖ్యం. మీరు ఏదైనా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లయితే, పీనట్ బటర్ తీసుకునే ముందు మీ డాక్టర్‌ను సంప్రదించండి.




# ఉదయం నిద్రలేవగానే ఈ అలవాట్లు మార్చుకోండి.. లేకపోతే తిప్పలే.!!



ఉదయం నిద్ర లేవగానే చేసే కొన్ని పొరపాట్లు మన రోజంతటిని ప్రభావితం చేస్తాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలంటే, నిద్రలేవగానే కొన్ని ప్రాథమిక తప్పిదాలను నివారించడం అవసరం. వీటిని గమనించి మార్గం సరిదిద్దుకుంటే, శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజంతా సంతోషంగా ఉండగలము. 1. ఫోన్లో ఎక్కువగా టైమ్ గడపడం నిద్రలేవగానే స్మార్ట్‌ఫోన్‌ను చూడటం అనేది సాధారణ అలవాటుగా మారిపోయింది. అయితే, ఇది శరీరానికి, మనసుకు హానికరం. ఫోన్‌లో వార్తలు లేదా సోషల్ మీడియాను చూడడం అనవసర ఆందోళనను కలిగించవచ్చు. ఉదయపు మొదటి గంటలను ప్రశాంతంగా గడపడం శ్రేయస్కరం. ంశ్రీబనీ ఖీవజీట "ప్రతి రోజూ ఉడకబెట్టిన గుడ్లు తింటున్నారా?" 2. సడన్‌గా పడక నుండి లేచిపోవడం సడన్‌గా పడక మీద నుండి లేచిపోవడం శరీరానికి ప్రమాదకరం. ఇది రక్తప్రసరణను ప్రభావితం చేయవచ్చు. నిద్రలేవగానే రెండు నిమిషాలు నెమ్మదిగా కూర్చోవడం మంచిది. దీనివల్ల శరీరం మెల్లగా కొత్త రోజు కోసం సన్నద్ధమవుతుంది. 3. బరువు తీసే పనులు చేయడం కొత్తగా నిద్రలేవగానే శరీరం ఇంకా నిద్రావస్థలోనే ఉంటుంది. అప్పుడు శారీరకంగా గట్టిగా పని చేయడం, ముఖ్యంగా ఎక్సర్‌సైజ్‌లు చేయడం శరీరానికి మానసికంగా ఒత్తిడిని కలిగించవచ్చు. మారిన చైతన్య స్థితిని అనుభవించి, కొంత సమయం తర్వాత వ్యాయామం చేయడం ఉత్తమం. ఖీవఇనీఎఎవనిటవట "జింక్ లోపం ఫెర్టిలిటీ సమస్యకు దారితీస్తుందా?" 4. బరువైన భోజనం తినడం ఉదయం నిద్రలేవగానే కడుపు శుభ్రంగా ఉంటుంది. అప్పుడే అధిక కొవ్వు లేదా గట్టి ఆహారం తినడం జీర్ణక్రియను కష్టతరం చేస్తుంది. మొదట తేలికపాటి గ్లాసు నీరు లేదా తాజా పండ్ల రసం తాగడం శ్రేయస్కరం. 5. నీరు తాగకుండా ఉండడం నిద్రపోయే సమయం మొత్తం శరీరం నీటిలోని తక్కువమోతాదుతో పనిచేస్తుంది. నిద్రలేవగానే నీరు తాగకపోవడం డీహైడ్రేషన్‌ను మరింత పెంచుతుంది. కనీసం ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిని తాగడం శరీరానికి శక్తిని అందిస్తుంది. 6. నెగెటివ్ ఆలోచనలు చేయడం ఉదయం మొదటి ఆలోచనలు మీ మానసిక స్థితిని ప్రభావితం చేస్తాయి. నిద్రలేవగానే నెగెటివ్ ఆలోచనలు చేయడం రోజంతా మానసిక ప్రశాంతతను దెబ్బతీయవచ్చు. దీని బదులు, ధ్యానం చేయడం లేదా పాజిటివ్ ఆలోచనలు చేయడం మంచిది. జనీబీ ఓజీఎ ంశ్రీబనీ ఒతినివ "డార్క్ చాక్లెట్ టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుందా?" 7. ఎక్కువ సేపు పడుకోవడం నిద్రలేవగానే పొద్దు పొడిచేంతవరకు పడుకోవడం మరింత అలసటను కలిగిస్తుంది. అనవసరంగా ఎక్కువ సేపు పడుకోవడం శరీర చక్రాన్ని దెబ్బతీయవచ్చు. సమయానికి నిద్రలేవడం ఆరోగ్యకరమైన అలవాటుగా మారుతుంది. 8. గాలి పీల్చుకోకపోవడం ఉదయం శుభ్రమైన గాలి శరీరానికి శక్తిని అందిస్తుంది. నిద్రలేవగానే గదిలోనే ఉంటూ గాలి పీల్చుకోకపోవడం శ్వాసకోశ ఆరోగ్యానికి ప్రతికూలం. బహిరంగ గాలిలో పది నిమిషాలు గడపడం ఉత్తమం. 9. రోజుకి ప్లాన్ లేకపోవడం ఉదయాన్నే రోజు మొత్తం చేసే పనుల గురించి ఓపెన్ ఆలోచన చేయకపోవడం టైమ్ మేనేజ్‌మెంట్‌లో సమస్యలను కలిగిస్తుంది. కొంత సమయం కేటాయించి, పనుల జాబితాను తయారు చేసుకోవడం మంచి అలవాటు. ఈ అలవాట్లను మార్చుకోవడం ద్వారా శరీరాన్ని, మనస్సును ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చు. నిద్రలేవగానే ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా కొత్త రోజును ఉత్తేజంగా ప్రారంభించవచ్చు.

# అతిగా నిద్రపోయే వారిలో వచ్చే సమస్యలు ఇవే!

నిద్ర మన శరీరం ఆరోగ్యానికి అవసరమైన ప్రాథమిక అవసరం. సరైన సమయం వరకు నిద్రపోవడం శరీరానికి విశ్రాంతి కల్పించి, శక్తిని పునరుద్ధరిస్తుంది. అయితే అతిగా నిద్రపోతే ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. ప్రతి రోజూ 7-9 గంటల నిద్ర సమర్థవంతమైన శారీరక, మానసిక ఆరోగ్యం కోసం సరిపోతుంది. కానీ దీని మించి ఎక్కువ సమయం నిద్రించడం అనేక సమస్యలకు కారణమవుతుంది. అతిగా నిద్ర వల్ల కలిగే ప్రధాన సమస్యలు: 1. మెదడు పనితీరు తగ్గుదల ఎక్కువ సమయం నిద్రించేవారిలో మెదడు పనితీరు మందగిస్తుంది. ఇది మతిమరుపు, ఏకాగ్రత లోపం వంటి సమస్యలకు దారితీస్తుంది. కొన్నిసార్లు మెదడు విషాదం ) గ్రస్తమవుతుంది. "ప్రతి రోజూ ఉడకబెట్టిన గుడ్లు తింటున్నారా?" 2. శరీర బరువు పెరుగుదల అధిక నిద్రతో శారీరక చలనాలు తగ్గిపోతాయి. వ్యాయామం లేకపోవడం, అనవసరమైన నిద్ర సమయం భౌతిక శక్తి వినియోగాన్ని తగ్గించి, బరువు పెరగడం లేదా స్థూలకాయం వంటి సమస్యలు తలెత్తుతాయి. అంతే కాకుండా తలనొప్పి, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, జీర్ణ సమస్యలు వంటి శారీరక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. 3. హృదయ సంబంధిత వ్యాధులు ఎక్కువ నిద్రపోవడం గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. దీర్ఘకాలికంగా ఈ అలవాటు గుండె నాడుల పనితీరు తగ్గించి, గుండె జబ్బులకు అవకాశం కల్పిస్తుంది. 4. మెటాబాలిజం సమస్యలు నిద్ర ఎక్కువగా ఉండడం మెటాబాలిజం ప్రక్రియను నెమ్మదింపచేస్తుంది. ఇది డయాబెటిస్ వంటి రోగాలకు



కారకమవుతుంది జనీబీ "ఉదయం నిద్రలేవగానే ఈ అలవాట్లు మార్చుకోండి.. లేకపోతే తిప్పలే.!!" 5. మానసిక ఒత్తిడి పెరగడం అతిగా నిద్రపోవడం వలన రోజువారీ పనులు చేయడానికి తగినంత సమయం అందక, మానసిక ఒత్తిడి అధికమవుతుంది. నిరాశ, ఆందోళన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. 6. జీవనశైలి ప్రభావం అధిక నిద్ర వల్ల జీవనశైలిలో మార్పులు తలెత్తుతాయి. ఇది రోజువారీ కార్యక్రమాలను ప్రభావితం చేస్తుంది. ఎక్కువ సమయం పడుకొని నిద్రించడం వల్ల మెడ, వెన్నుపూస, తల నొప్పులు తలెత్తుతాయి. 7.సంతాన సామర్థ్యం తగ్గుదల అతిగా నిద్రపోవడం వల్ల మహిళల్లో సంతాన సామర్థ్యం తగ్గే అవకాశం ఉంది. అధిక నిద్ర డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. ఒతినివ "జింక్ లోపం ఫెర్టిలిటీ సమస్యకు దారితీస్తుందా?" అతిగా నిద్రపోయే అలవాటు ఆరోగ్యానికి హానికరం. దీనివల్ల దీర్ఘకాలిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఎక్కువ. కాబట్టి నిద్ర సమయాన్ని నియంత్రణలో ఉంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ముఖ్యమని గుర్తించాలి. సరైన నిద్ర సమయాన్ని పాటించడం ముఖ్యం. రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, లేవడం అలవాటు చేసుకోవాలి. 7-8 గంటల నిద్ర అవసరం. మానసిక ప్రశాంతత కోసం మెడిటేషన్ వంటి చర్యలు చేపట్టడం మంచిది. అతిగా నిద్రిస్తే ఏ కారణాలు ఉండవచ్చో తెలుసుకోవడం కోసం డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం.

# చియా విత్తనాలను మజ్జిగలో కలిపి తీసుకోవచ్చా?

మజ్జిగతో చియా విత్తనాలు ఆరోగ్యానికి ఒక అద్భుతమైన కలయిక. మజ్జిగ , చియా విత్తనాలు రెండూ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరమైన ఆహారాలు. వీటిని కలిపి తీసుకోవడం మీ ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరచే అవకాశం ఉంది. ఈ రెండు ఆహారపదార్థాలలో కలిగిన పోషకాల వల్ల శరీరానికి వివిధ రకాల ప్రయోజనాలు అందుతాయి. మజ్జిగ – ఆహారంలోని రత్నం: మజ్జిగ, పాల నుండి తయారు చేయబడే ఈ ఆరోగ్యకరమైన పానీయం, ప్రొబయోటిక్స్‌తో నిండినది. ఇది జీర్ణవ్యవస్థను సమతుల్యం చేస్తుంది, కడుపు సమస్యలను తగ్గిస్తుంది, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. వేసవి కాలంలో ఇది ఒంటికి చల్లదనాన్ని అందిస్తుంది. ఉదయం నిద్రలేవగానే ఈ అలవాట్లు మార్చుకోండి.. లేకపోతే తిప్పలే.!!" చియా విత్తనాలు – సూపర్ ఫుడ్: చియా విత్తనాలు ప్రోటీన్, ఫైబర్, ఓమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్‌లు, ఖనిజాలతో నిండినవే కాకుండా, శరీరానికి శక్తిని అందించే సూపర్ ఫుడ్‌గా పేరుగాంచాయి. ఇవి నీటిలో నానబెట్టినప్పుడు జెల్ లాంటి ద్రవంగా మారి హైడ్రేషన్‌ను మెరుగుపరచడం, జీర్ణవ్యవస్థకు మేలు చేయడం వంటి ప్రయోజనాలను అందిస్తాయి. ఆరోగ్య ప్రయోజనాలు: జీర్ణ వ్యవస్థకు మేలు: చియా విత్తనాలు ఫైబర్‌కు మంచి మూలం. ఇవి జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి, మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తాయి. మజ్జిగలోని ప్రోబయోటిక్స్ కూడా జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. గుండె ఆరోగ్యం: చియా విత్తనాలు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్‌కు మంచి మూలం. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, రక్తపోటును తగ్గిస్తాయి. మజ్జిగలోని కాల్షియం కూడా గుండె ఆరోగ్యానికి ముఖ్యమైన పోషకం.



# స్పోర్ట్స్ న్యూస్

## వన్డే వరల్డ్ కప్ 2027: రోహిత్, కోహ్లీ భవితవ్యంపై బీసీసీఐ రియాక్షన్ ఇదే!

వన్డే ప్రపంచ కప్ 2027లో భారత జట్టు కూర్పు గురించి కొంతకాలంగా ఆసక్తికర చర్చ సాగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టెస్టు, టీ20లకు వీడ్కోలు పలికిన వెటరన్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్నారు. యువ ప్లేయర్లకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్న మేనేజ్‌మెంట్.. రో-కోను పరిగణనలోకి తీసుకుంటుందా? అనే చర్చ మొదలైంది. ఈ క్రమంలో రో-కో భవితవ్యంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జట్టు భవిష్యత్తు ప్రణాళికలు, ఆటగాళ్ల ఎంపికపై జరుగుతున్న చర్చలు పూర్తిగా అంతర్గత వ్యవహారాలని స్పష్టం చేశారు.'మాకు సమర్థవంతమైన నిపుణుల బృందం ఉంది. ప్రతి నిర్ణయంలో సంబంధిత వర్గాల అభిప్రాయాలు తీసుకుంటాం. జట్టు భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై ఎప్పటికప్పుడు చర్చలు జరుగుతూనే ఉంటాయి. అందుకే ప్రత్యేక సమావేశాల అవసరం ఇప్పటి వరకు రాలేదు. రోహిత్, కోహ్లీ వన్డే ప్రపంచ కప్‌లో ఆడుతారా? అనే ప్రశ్న చాలా మంది నుంచి ఎదురవుతోంది. అవన్నీ వ్యూహాత్మక చర్చలు. బోర్డు గదుల్లోనే ఉండాల్సిన అంశాలను మీడియాకు చెప్పడం సరైంది కాదు. వారి భవితవ్యం గురించి ఇప్పుడే ఏం చెప్పలేం. ఆ సమయానికి వారి ఫిట్‌నెస్ సహా పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకుంటాం' అని సైకియా వెల్లడించారు.ఐపీఎల్ 2026కి ముందు బంగ్లాదేశ్-భారత్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు ఏర్పడిన సంగతి తెలిసిందే. దాని కారణంగానే టీ20 ప్రపంచ కప్ నుంచి బంగ్లా వైదొలిగింది. అప్పటినుంచి ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు కూడా నిలిచిపోయాయి. ఈ అంశంపై కూడా సైకియా స్పందించారు. బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితుల కారణంగా వాయిదా పడిన భారత జట్టు వైట్ బాల్ పర్యటనపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో.. బీసీసీఐ కేంద్ర ప్రభుత్వ విధానాలకే కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.'ఇతర దేశాల రాజకీయ పరిస్థితులతో బీసీసీఐకి సంబంధం లేదు. ద్వైపాక్షిక, అంతర్జాతీయ క్రీడా పోటీల విషయంలో భారత ప్రభుత్వం రూపొందించే విధానాలనే మేము అనుసరిస్తాం. ఏ దేశంలో ఎలాంటి ప్రభుత్వం ఉందనేది మా పరిధిలోని విషయం కాదు. మా పని క్రికెట్ నిర్వహణ మాత్రమే' అని సైకియా పేర్కొన్నారు.



## టీమిండియాకు కోచ్ అవసరం లేదు.. గంభీర్‌పై శ్రీశాంత్ విమర్శలు



భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకుంటున్న నిర్ణయాలపై కొంతకాలంగా విమర్శలు వస్తోన్న సంగతి తెలిసిందే. అతడి నేతృత్వంలోని టీమిండియా స్వదేశంలోనే టెస్టు సిరీస్‌లు ఓడిపోయింది. గంభీర్ తీసుకుంటున్న నిర్ణయాల వల్లే జట్టుకు ఓటములు ఎదురవుతున్నాయంటూ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్.. గంభీర్‌పై తీవ్ర విమర్శలు చేశాడు. భారత జట్టుకు కోచ్ అవసరం లేదని.. ఒక మంచి మెంటార్ కావాలని అభిప్రాయపడ్డాడు.'టీమిండియా ఇటీవల ఎదుర్కొన్న వైఫల్యాలన్నీ గంభీర్ హయాంలోనే వచ్చాయి. న్యూజిలాండ్ చేతిలో స్వదేశంలో 0-3 తేడాతో సిరీస్ క్లీన్ స్వీప్, సౌతాఫ్రికాపై మరో సిరీస్ ఓటమి, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోవడం వంటి వాటికి గంభీర్ నిర్ణయాలే కారణం. భారత్‌కు కోచ్ అవసరం లేదు.. ధోని లాంటి ఒక మంచి మెంటార్ కావాలి. గంభీర్ విధానాలతో నేను ఎప్పటికీ ఏకీభవించను. ఆటగాళ్లపై చాలా ఒత్తిడి పెడుతున్నారు. ఈ స్థాయిలో ఉన్న క్రికెటర్లకు మార్గ నిర్దేశం చేయాలి కానీ భయపెట్టకూడదు' అని శ్రీశాంత్ వెల్లడించాడు.'ధోని ఎప్పుడూ ఆటగాళ్లను ఒత్తిడిలోకి నెట్టడం చూడలేదు. విఫలమైన వెంటనే ప్లేయర్లను పక్కన పెట్టే సంస్కృతి అతడి వద్ద లేదు. ప్లేయర్లలో ఆత్మవిశ్వాసం నింపడం, స్వేచ్ఛగా ఆడే వాతావరణం కల్పించడం ధోని ప్రత్యేకత. ముందు ఒక సోదరుడిలా ఉండాలి. గెలిస్తే నవ్వి, ఓడితే కోప్పడటం సరికాదు. జట్టుకు ధోని లాంటి మెంటార్ అవసరం. టీ20 ప్రపంచ కప్ విజయంలో గంభీర్‌కు అతిగా క్రెడిట్ ఇస్తున్నారు. కానీ మైదానంలో ఆటగాళ్లే ప్రదర్శన చేశారు. సరైన సమయంలో పక్కాగా నిర్ణయాలు తీసుకున్న వారే విజయానికి కారణం అవుతారు' అని శ్రీశాంత్ వెల్లడించాడు.

## వైభవ్ రాణిస్తే టెస్ట్ క్రికెట్‌కు పునరుజ్జీవనం

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తనదైన హిట్టింగ్‌తో ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ గా మారాడు. ఐపీఎల్ 2026లో అద్భుతమైన ప్రదర్శనతో ఎంతో మంది స్టార్ ప్లేయర్లను వెనక్కి నెట్టి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. దీంతో టీమిండియా సీనియర్ జట్టుకు కూడా అతడు ఎంపికవ్వడంతో అభిమానులకు భారీ అంచనాలే ఏర్పడ్డాయి. ప్రస్తుతం వైభవ్ భారత-ఎ జట్టు తరపున ఆడుతూ శ్రీలంకలో ఉన్నాడు.ముక్కోణపు సిరీస్ ముగిశాక.. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ ఉంది. ఆ తర్వాత ఇంగ్లాండ్‌తోనూ పొట్టి ఫార్మాట్‌లో ఐదు మ్యాచులను భారత్ ఆడనుంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఆటగాడు క్రిష్ణమాచారి శ్రీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌ను మరీ ఎక్కువగా విశ్లేషిస్తూ ఒత్తిడికి గురి చేయొద్దని క్రీడా విశ్లేషకులకు, అభిమానులకు సూచించాడు. వైభవ్ ఇలానే టెస్టుల్లోనూ రాణిస్తే.. ఆ ఫార్మాట్‌కు పునరుజ్జీవనం వస్తుందని అభిప్రాయపడ్డాడు.'పరుగులు సాధించాలని అనుకోవడంతో పాటు ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాలనే బలమైన కోరిక వైభవ్ సూర్యవంశీలో ఉంది. అదే అతడిలో నాకు నచ్చే అంశం. క్రీజ్‌లో నిలదొక్కుకుని ఆడగల సామర్థ్యం కూడా అతడిలో ఉంది. టీ20 క్రికెట్ నుంచి వన్డేలకు, ఆ తర్వాత టెస్టుల్లో వృద్ధి చెందితే మాత్రం సుదీర్ఘ ఫార్మాట్‌కు అద్భుతమైన కళ తీసుకురాగలడు. వైభవ్ లాంటి కుర్రవాళ్లే టెస్టు క్రికెట్ పునరుజ్జీవనంలో కీలక పాత్ర పోషిస్తారు. వైభవ్ ఆటను చూసేందుకు అభిమానులు టీవీ ఆన్ చేస్తున్నారు. అభిమానులను ఆకర్షించే సత్తా అతడికి సహజంగానే వచ్చింది' అని క్రిష్ పేర్కొన్నాడు.'వైభవ్ గురించి మరీ ఎక్కువగా విశ్లేషణలు చేసి, అతడిని అనవసర ఒత్తిడికి గురి చేయొద్దు. వైభవ్ సహజ సిద్ధంగా ఆటను ఆడేలా చూడాలి. ఒక్క సిరీస్‌లో ఏదైనా సరిగ్గా ఆడలేకపోతే వెంటనే సదరు ప్లేయర్‌ను ఆటను నిర్ణయించ వద్దు. కాస్త సమయం ఇవ్వాలి. తొలిసారి ఆడిన ఐపీఎల్‌లోనే అదరగొట్టాడు. ఇక ఇటీవల సీజన్‌లో చాలా అవార్డులను సొంతం చేసుకున్నాడు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీకి అవకాశం రాకపోయినా ఫర్వాలేదు. రిజర్వ్ బెంచ్‌లో ఉండనివ్వండి. అతడికి అంతర్జాతీయ క్రికెట్ ఎలా ఉంటుందో అర్థం చేసుకొనేందుకు అవకాశం ఉంటుంది. ప్రత్యర్థి చిన్న జట్టైనా.. పెద్ద జట్టైనా సరే వైభవ్‌ను మాత్రం స్వేచ్ఛగా ఆడేలా చూడాల్సిన బాధ్యత టీమిండియా మేనేజ్‌మెంట్‌పై ఉంది' అని శ్రీకాంత్ వెల్లడించాడు.



## అతడు మరో నాలుగేండ్లు ఆడుతాడు.. తేల్చి చెప్పిన ఆర్సీబీ సీఈవో రాజేష్ మీనన్



ఐపీఎల్ చరిత్రలో విరాట్ కోహ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుది(ఖీఅః) విడదీయరాని బంధం. 2008 లీగ్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు ఒకే ఫ్రాంచైజీ తరపున 19 సీజన్లలో ఆడిన ఏకైక ఆటగాడిగా ఈ బ్యాటింగ్ దిగ్గజం నిలిచాడు. తాను జట్లు మారే ప్రణాళికలు లేవని, తన ఐపీఎల్ కెరీర్‌ను ఆర్‌సీబీతోనే ముగించాలనుకుంటున్నానని కోహ్లీ పలు సందర్భాల్లో స్పష్టం చేశాడు. ఆర్సీబీ అభిమానులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న కలను నిజం చేస్తూ వరుసగా గత రెండు సీజన్‌లో ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకోవడం ద్వారా ఆర్‌సీబీ తమ టైటిల్ కరువును తీర్చుకుంది.ఈ క్రమంలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్(ఎఖఒ) భవిష్యత్తుపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీఈఓ రాజేశ్ మీనన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ మరో 3 నుంచి 4 ఏళ్ల పాటు ఐపీఎల్‌లో ఆర్‌సీబీ తరపునే ఆడతారని ఆయన స్పష్టం చేశారు. రిటైర్మెంట్ తర్వాత కూడా కోహ్లీ ఫ్రాంచైజీతో కొనసాగుతారని పేర్కొన్నారు. అతను పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. ఆట పట్ల అతనికి ఉండే తపన ఏమాత్రం తగ్గలేదు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అతనిలో కనిపించిన ఉత్సాహం చూస్తుంటే మరికొంత కాలం ఆడేందుకు ఎలాంటి సమస్యా ఉండదని ఆయన స్పష్టం చేశారు. అనుభవజ్ఞుడైన విరాట్ లాంటి బ్యాటర్ జట్టుకు ఎంతో ఉపయోగకరమన్నారు.

## గోల్డెన్ బూట్ రేసు.. లీడింగ్‌లో మెస్సి, డేవిడ్



న్యూయార్క్: ఫిఫా వరల్డ్‌కప్ 2026 .. ఫుల్ స్వింగ్‌లో సాగుతోంది. మేటి ప్లేయర్ల తమ ట్యాలెంట్ ప్రదర్శిస్తున్నారు. ఇక అడిడాస్ గోల్డెన్ బూట్ రేసులో మెస్సీ, డేవిడ్ ఉన్నారు. ఈ ఇద్దరూ ఇప్పటికే టోర్నీలో హ్యాట్రిక్ గోల్స్ కొట్టారు. అత్యధిక గోల్స్ కొట్టిన ప్లేయర్‌కు గోల్డెన్ బూట్ అవార్డును ప్రజెంట్ చేసే విషయం తెలిసిందే. అర్జెంటీనా స్టార్ లియోనిల్ మెస్సీ గ్రూజ్ జేలో అల్జీరియాతో జరిగిన తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. ఆరో వరల్డ్‌కప్ ఆడుతున్న మెస్సీ.. ఇప్పటికే 16 గోల్స్ చేసి.. ఆల్ టైం లీడింగ్ స్కోరర్ మిరోస్లేవ్ క్లోస్‌తో సమంగా నిలిచాడు.కోహోస్ట్ మెక్సికో ప్లేయర్ జోనాథన్ డేవిడ్ కూడా హ్యాట్రిక్ గోల్స్ చేశాడు. ఖతార్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను మూడు గోల్స్ తీశాడు. దీంతో మెస్సి, డేవిడ్‌లు.. గోల్డెన్ బూట్ రేసులో ముందున్నారు. ప్రస్తుతం ఇంకా గ్రూప్ స్టేజ్ దశలోనే వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. మరో వైపు అనేక మంది మేటి ప్లేయర్లు కూడా గోల్డెన్ బూట్ రేసులో ఉన్నారు. కైలియన్ ఎంబాప్పే, ఎర్లింగ్ హాలాండ్, హ్యారీ కేన్ కూడా ఆ రేసులో ఉన్నారు. ఇప్పటి వరకు ఈ టోర్నీలో 9 మంది ప్లేయర్లు రెండేసి గోల్స్ చేశారు.ఒకవేళ టోర్నీలో ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది ప్లేయర్లు అత్యధిక స్థాయిలో గోల్స్ చేస్తే, అప్పుడు అసిస్ట్‌ల ఆధారంగా గోల్డెన్ బూట్ విజేతను నిర్ధారిస్తారు. గోల్ స్కోరింగ్ చేసే ప్లేయర్‌కు ఎంత మంది బంతిని అందిస్తారో దాని ఆధారంగా అసిస్ట్‌లను ఫిఫా టెక్నికల్ టీమ్ నిర్ణయిస్తుంది. ఒకవేళ అసిస్ట్‌లు కూడా సమానంగా ఉంటే, అప్పుడు టోర్నీలో ఆ ప్లేయర్ ఎన్ని నిమిషాలు ఆడారన్న దాని ఆధారంగా విజేతను ప్రకటిస్తారు.

## టీమిండియాకు గుడ్ న్యూస్.. హర్షిత్ రాణా రీ ఎంట్రీ

గాయం నుంచి కోలుకున్న యువ ఫాస్ట్ బౌలర్, ఆల్ రౌండర్ హర్షిత్ రాణా అఫ్ఘనిస్తాన్‌తో చెన్నై వేదికగా జరగనున్న మూడో వన్డే కోసం భారత జట్టులో చేరాడు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన టీ20 ప్రపంచ కప్ వార్మప్ మ్యాచ్‌లో రాణా మోకాలికి గాయం కావడంతో అతను మొత్తం టోర్నమెంట్‌తో పాటు 2026 ఐపీఎల్ సీజన్‌కు కూడా దూరమయ్యాడు.బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స తీసుకున్న అనంతరం కోలుకొని తిరిగి జట్టుతో కలిశాడు.ఈ సిరీస్‌లో ఇప్పటికే భారత్ 2-0 ఆధిక్యంలో ఉన్నందున రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలను దృష్టిలో ఉంచుకుని హర్షిత్ రాణాకు ఫిట్‌నెస్ నిరూపించుకునే అవకాశం కల్పిస్తున్నారు.శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే, యశస్వి జైస్వాల్, హర్షిత్ రాణా



# సినిమా

## ఇరుముడితో అదృష్టం వెతుక్కుంటున్న భవానీ శంకర్





న్యూస్ ప్రజెంటర్ నుండి హీరోయిన్‌గా ఛేంజైన చెన్నై పొన్ను ప్రియా భవానీ శంకర్ అనతికాలంలోనే యా÷-టకెస్గా ఐడెంటిటీని దక్కించుకుంది. సపోర్టింగ్ రోల్స్ చేసుకుంటూ.. సెల్ఫ్ మేడ్ హీరోయిన్‌గా మేకోవర్ అయ్యింది. కోలీవుడ్‌లో ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ.. టాలీవుడ్‌లో మాత్రం సక్సెస్ కోసం స్ట్రగుల్ ఫేస్ చేస్తోంది. తెలుగులో ఇప్పటి వరకు చేసిన త్రీ మూవీస్ ప్లాప్సే. సంతోష్ శోభన్ హీరోగా తెరకెక్కిన కళ్యాణం కమనీయంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది ప్రియా భవానీ శంకర్. కానీ ఈ సినిమా వచ్చి పోయిన విషయం తెలియదు ఆడియన్స్‌కు. కానీ దూత వెబ్ సిరీతో చేరువైంది. ఇందులో నాగ చైతన్య భార్యగా కరెప్టెడ్ జర్నలిస్ట్‌గా నటించింది. ఈ సిరీస్.. గోపీచంద్‌తో భీమ, సత్య దేవ్ జీబ్రాలో నటించే తెచ్చిపెట్టింది కానీ, ఈరెండు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడటంతో టీటౌన్‌లో అవకాశాలు తగ్గాయి. కోలీవుడ్ ఆఫర్స్‌తో కాలం నెట్టుకొస్తున్న ప్రియాకు.. మరొక ఛాన్స్ ఇస్తోంది టాలీవుడ్ . శివ నిర్వాణ- రవితేజ కాంబోలో తెరకెక్కుతోన్న ఇరుముడిలో నటిస్తోంది. రవితేజకు భార్యగా కావేరి పాత్రలో కనిపించబోతుంది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఫిల్మ్. షూటింగ్ కంప్లీట్ కావడంతో సెట్స్‌లోని పిక్స్ సోషల్ మీడియాలో పంచుకుంది ప్రియ. అలాగే దూత సీక్వెల్‌లోనూ కంటిన్యూ కాబోతుంది. రీసెంట్లీ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ప్రియా ఎ÷-లాప్స్ పట్టించుకోకుండా టాలీవుడ్ ఆఫర్స్ ఇస్తోంది.. మరీ మేడమ్ వాటిని సద్వినియోగం చేసుకుంటుందో లేదో.

## ప్రకృతి ప్రేమికుడు భారతీరాజా

### పల్లె అందాలకు చిత్రాల్లో పెద్దపీట

ప్రకృతిని ప్రేమించడం..అనుభవించడం..ఆస్వాదించడం..ఆనందించడం అందరికీ తెలుసు. కాన ఈప్రకృతి రమణీయకతను సెల్యూలాయిడ్‌పై చూపి ప్రేక్షకులను రంజిపం చేయడం కొందరికే తెలుసు. అందులో ముందుంటారు దర్శకులు భారతీరాజా. ఆయన తీసిన చిత్రలే అందుకు నిదర్శనం. భారతీయ సినీ ప్రపంచంలో గ్రామీణ జీవితానికి కొత్త భాషను నేర్పిన దర్శకుడు ఆయన పల్లె అందం, అక్కడి మనుషుల స్వచ్ఛమైన ప్రేమ, వారి అనుబంధాలు - ఆనందాలు, బాధలు - భావోద్వేగాలను ఎంతో సహజంగా వెండితెరపై ఆవిష్కరించడంలో ఆయన తరవాతే ఎవరైనా. ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమా మట్టివాసనతో నిండిన ఓ జీవనరాగంలా అనిపిస్తుంది. ప్రేమను కవిత్వంగా, బంధాలను హృద్యంగా, ప్రకృతిని పాత్రగా మలిచిన ఆయన చిత్రాలు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి. భావోద్వేగాలకు దృశ్యరూపమిచ్చిన ఓ గొప్ప కథకుడుగా ఆయన చిత్రసీమలో నిలిచి పోయారు. భారతీరాజా భౌతికంగా దూరమయినా, ఆయన తీసిన మణిపూసల్లాంటి చిత్రాలు నిరంతరం మన మనసులను తడుతూనే ఉంటాయి. కన్నడ దర్శకుడు పుట్టణ్ణ కనగల్, పి.పుల్లయ్య వంటి దిగ్గజాల వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసి సినిమాలో మెళకువలు నేర్చుకున్నారు. అలా ఆయన పరిశ్రమలోకి అడుగుపెట్టారు.భారతీరాజా తన సినిమాల్లో ఎక్కువగా పల్లెటూరి కథలనే చూపించేవారు. మట్టివాసనను వెండితెర పైకి తెచ్చిన దర్శకుడిగా ఆయనకు పేరుంది. హీరోయిన్లను మేకప్ లేకుండా స్వచ్ఛంగా చూపించేవారు. దీని వెనుక కారణాన్ని ఆయన ఓ సందర్భంలో తనదైన చతురతను జోడించి చెప్పారు. 'ప్రకృతికాంత' అందానికి ముగ్ధుడినయ్యా. అందుకే కెమెరా పట్టుకుని ఆ అందాన్ని వెతుక్కుంటా అంటూ పల్లెలపై తన ప్రేమను వ్యక్తపర్చారు. 1977లో వచ్చిన '16 వయతినిలే' (తెలుగులో 'పదహారేళ్ల వయసు' పేరుతో రీమేక్ అయ్యింది) సినిమాతో భారతీరాజా దర్శకుడిగా పరిచయమయ్యారు. అప్పటివరకు కేవలం స్టూడియో సెట్టింగులకే పరిమితమైన తమిళ సినిమాను నిజమైన పల్లెటూరి లొకేషన్లలోకి తీసుకెళ్లి సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. ఎలాంటి మేకప్ లేకుండా హీరోలను చూపించడం, ఎలాంటి అదనపు సొగసుల జోలికి వెళ్లకుండా సహజంగా ఉన్న అమ్మాయిలను హీరోయిన్లుగా పరిచయం చేయడంతో అప్పటి సినీ సంప్రదాయాలను తిరగరాశారు. కేవలం గ్రామీణ చిత్రాలకే పరిమితం కాకుండా, 'సిగప్పు రోజాక్కల్' (తెలుగులో ఎర్ర గులాబీలు) వంటి సైకో థ్రిల్లర్ చిత్రాలతో తన బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. తెలుగులో ఆయన దర్శకత్వం వహించిన 'సీతాకోకచిలుక' (1981) చిత్రం అప్పట్లో పెను సంచలనం సృష్టించింది.

కుల వివక్షకు వ్యతిరేకంగా ఆయన తీసిన 'వేదం పుదిదు' సినిమా సమాజంలో పెద్ద చర్చకు దారితీసింది. రాధిక, రాధ, రేవతి, కార్తీక్, విజయశాంతి వంటి ఎందరో నటీనటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. భారతీరాజా ప్రతిభకు ఎన్నో అవార్డులు దాసోహమన్నాయి. ఆయన తన కెరీర్‌లో దాదాపు 40 చిత్రాలకు దర్శకత్వం వహించి, 'ఇయక్కునార్ ఇమయం (దర్శక శిఖరం)' అనే బిరుదును పొందారు. జాతీయ అవార్డులు: వివిధ విభాగాల్లో మొత్తంగా 6 జాతీయ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. ఇందులో తెలుగు చిత్రం 'సీతాకోకచిలుక'కు ఉత్తమ ప్రాంతీయ చిత్ర అవార్డు కూడా ఉంది. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ 2004లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. వీటితో పాటు 4 ఫిలింఫేర్ అవార్డులు, 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నంది అవార్డులను ఆయన సొంతం చేసుకున్నారు. ఆయన కేవలం దర్శకత్వానికే పరిమితం కాకుండా నటుడిగానూ అలరించారు. 'ఆయుధ ఎళుతు', 'పాండియనాడు', 'తిరుచిత్రంబలమ్' (తిరు), గతేడాది వచ్చిన విజయ్ సేతుపతి 'మహారాజా' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మెప్పించారు. మోహన్‌లాల్ 'తుడరుమ్'లో చివరిసారి తెరపై కనిపించారు. అలాగే ఆయన నటించిన 'పులవర్' చిత్రం ఇంకా విడుదల కావాల్సిఉంది. భారతీరాజా తర్వాతితరం చిత్రనిర్మాతల కు శిక్షణ ఇవ్వడానికి 'భారతీరాజా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సినిమా'ని స్థాపించారు.

## దసరాకు షిఫ్ట్ అయిన టాక్సిక్ విడుదల

### చిత్ర వర్గాల్లో బలమైన టాక్




కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' గురించి మరోసారి ఆసక్తికర వార్తలు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలన క్రేజ్ సంపాదించుకున్న యష్ నుంచి వస్తున్న తదుపరి సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా నటిస్తుండగా, కీలక పాత్రల్లో హుమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార కనిపించనున్నారని సమాచారం. భారీ తారాగణం, హై బ్జడెట్ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా మొదటి నుంచే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ చిత్రం ఇప్పటికే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, మేకర్స్ సరైన సమయాన్ని ఎంపిక చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ పరిస్థితులు, ఇతర పెద్ద సినిమాల విడుదలలు, పాన్ ఇండియా స్థాయిలో బిజినెస్ అవకాశాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడుదలను వాయిదా వేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా ఈ ఏడాది అక్టోబర్ నెలకు షిఫ్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయట.

## 19న రానున్న మా ఇంటి బంగారం




'మా ఇంటి బంగారం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతోంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రధారిగా నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. దర్శకులు దేవా కట్టా, డీకే, రాహుల్ రవీంద్రన్, నిర్మాతలు డి.సురేశ్‌బాబు, వై రవిశంకర్, స్వప్న దత్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ.. 'ఈ సినిమాతో కచ్చితంగా ఒకొక్కర్ని ప్రేమతో కొడతా. దీన్ని మేమంతా చాలా ప్రేమతో చేశాం. ఇప్పటి వరకు నటిగా నా కెరీర్ చాలా సాఫీగా సాగిపోయింది. కానీ, నటిగా, నిర్మాతగా ఉండటంలో ఉన్న కష్టమేంటన్నది నాలుగైదు రోజులుగా అర్థమవుతోంది. సమష్టి కృషి వల్లే ఈ చిత్రం సాధ్యమైంది. ఈ సినిమాలో నేను చాలా సహజంగా నటించానంటే దానికి ప్రధాన కారణం దీంట్లో ఉన్న సంభాషణలే. ఇందులో నేను చీరలో ౧÷ట్లు చేశాను. చాలా కష్టంగా అనిపించింది. దీంట్లో యాక్షన్ సన్నివేశాలన్నీ అలరిస్తాయి. ఈ సినిమాలో ప్రతిఒక్కరూ అద్భుతంగా నటించారు' అన్నారు.'నా జీవితంలో ఈ సినిమాకి పడినంత కష్టం ఏ చిత్రానికి పడలేదు. సమష్టి కృషితో దీన్ని ఆరు నెలల్లో పూర్తి చేయగలిగాం. సమంత, రాజ్ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని నమ్ముతున్నా.
ఈ నెల 19న మీకు నచ్చిన సామ్‌ని పది రెట్లు గొప్పగా తెరపై చూస్తారు' అన్నారు దర్శకురాలు నందినీ రెడ్డి. ఈ కార్యక్రమంలో చిన్మయి, దిగంత్, ఆనంద్, హిమాంక్, శ్రీలక్ష్మి, గవిరెడ్డి, పొనీ వర్మ తదితరులు పాల్గొన్నారు.




## ఆల్ఫా టీజర్ విడుదల

### భారీ యాక్షన్ సీన్లతో కొత్తగా ఆలియా భట్




యశ్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ నుంచి వస్తున్న 7వ సినిమా 'ఆల్ఫా' టీజర్ బుధవారం విడుదలైంది. శివ్ రావల్ దర్శకత్వంలో భారీ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో అలియా భట్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపించింది. ఈ టీజర్‌లో అలియా భట్ ఒక ట్రైన్డ్ కిల్లర్‌గా శత్రువులపై విరుచుకుపడుతూ కనిపించగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఆమెకు తండ్రిగా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అలియా భట్ కేవలం ఒక సాధారణ అమ్మాయిలా కాకుండా, చిన్నప్పటి నుంచే పోరాటాల మధ్య పెరిగిన ఒక ప్రమాదకరమైన హంతకురాలిగా కనిపించబోతుంది. భారీ యాక్షన్ సీన్లు, గన్‌÷ట్లు, ౧÷టింగ్‌లతో ఆమె అదరగొట్టింది. ఈ టీజర్ సినిమాలోని యాక్షన్‌ను చూపించడమే కాకుండా, అలియా భట్, బాబీ డియోల్ పాత్రల మధ్య ఉండే బలమైన బంధాన్ని కూడా చూపిస్తోంది.మరోవైపు ఈ సినిమాలో మరో హీరోయిన్ శర్వరి కూడా నటిస్తోంది. రాబోయే రోజుల్లో ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను చిత్ర బృందం ప్రకటించనుంది. బాలీవుడ్‌లో ఇద్దరు హీరోయిన్లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న అరుదైన భారీ యాక్షన్ సినిమా ఇది. యాక్షన్, సెంటిమెంట్, సస్పెన్స్, కామెడీ కలబోతగా వస్తున్న ఈ సినిమాలో అనిల్ కపూర్ కూడా ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ స్పై థ్రిల్లర్ మూవీ 2026, జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## విశ్వంభర విడుదల తేదీపై సందిగ్ధత

### అధికారికంగా ప్రకటించని మేకర్స్




మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో-ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'విశ్వంభర' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే సినిమా విడుదల తేదీ విషయంలో కొనసాగుతున్న అనిశ్చితి మెగా ఫ్యాన్స్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే అంశంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్‌ను మరోసారి ఫాంటసీ ప్రపంచంలో చూడబోతున్నామని అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అయితే షూటింగ్ పూర్తయినప్పటికీ విడుదల తేదీపై ఇంకా స్పష్టత లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మొదట ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరిగింది. ఆ తర్వాత ఆగస్టు రిలీజ్‌పై కూడా వార్తలు వినిపించాయి. కానీ చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో ఆ వార్తలన్నీ కేవలం ఊహాగానాలు గానే మిగిలిపోయాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'విశ్వంభర'ను ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలనే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు తెలుస్తోంది. దసరా సీజన్‌కు భారీ చిత్రాలకు మంచి మార్కెట్ ఉండటంతో ఈ పండుగను లక్ష్యంగా పెట్టుకున్నారని టాక్ వినిపిస్తోంది.దీనికి ప్రధాన కారణం రాబోయే నెలల్లో టాలీవుడ్‌లో భారీ చిత్రాలు క్యూ కడుతుండడం. డిసెంబర్ నుంచి వరుస స్టార్ హీరోల సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. అలాగే 2027 సంక్రాంతి, సమ్మర్ సీజన్లు కూడా ఇప్పటికే పలు క్రేజీ ప్రాజెక్టులతో బుక్ అయ్యాయి. దీంతో 'విశ్వంభర'కు సరైన విడుదల తేదీ ఎంపిక చేయడం మేకర్స్‌కు సవాలుగా మారిందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com